
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
నల్లగొండ
5
శనివారం 19 అక్టోబరు 2024



హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ : 18004251442

యాదాద్రి : 1800 425 7106

సూర్యాపేట : 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 75

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.154	236	266
సూర్యాపేట	రూ.145	220	250
నల్లగొండ	రూ.148	216	244

ఉష్ణోగ్రత గరిష్ఠం 30.0 । కనిష్ఠం 23.2



ఘనంగా దర్గా ఉర్సు ఉత్సవాలు

జిల్లా కేంద్రంలోని క్లాక్‌టవర్ సెంటర్‌లోని హజ్రత్ సయ్యద్ లతీఫుల్లా షాఖాద్రి దర్గా ఉర్సు ఉత్సవాలు రెండో రోజు శుక్రవారం భక్తిశ్రద్ధలతో సాగాయి. భక్తులు అధిక సంఖ్యలో హాజరై దర్గాను దర్శించుకొని పూజల్లో పాల్గొన్నారు. పాత కలెక్టరేట్ మసీదులో ప్రత్యేకంగా దైవప్రార్థనలు చేసి లతీఫుల్లా షాఖాద్రి ధర్మమార్గాలను ప్రబోధించారు. అనంతరం ఖురాన్ పఠనం చేశారు. దర్గాపైన ప్రత్యేకంగా ముతవల్లులు దీపారాధన, ప్రార్థనలు నిర్వహించారు. దర్గాకు హాజరైన భక్తులందరికీ నిరంతర అన్నదానం చేశారు. గుట్టమెట్ల వద్ద ఏర్పాటుచేసిన



నూతన ఎస్ఈగా వెంకటేశ్వర్లు బాధ్యతల స్వీకరణ

టీజీఎస్‌పీడీసీఎల్ సర్కిల్ ఎస్ఈగా నియమితులైన ఎ.వెంకటేశ్వర్లు శనివారం బాధ్యతలు తీసుకున్నారు. ఇప్పటి వరకు ఇక్కడ ఎస్ఈగా పనిచేసిన పాల్‌రాజు ఇటీవల సస్పెండ్ కగా, ఆయన స్థానంలో యాదాద్రి జిల్లాకు చెందిన కన్‌స్ట్రక్షన్ డీఈకి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఆయన స్థానంలో నాగర్‌కర్నూల్ జిల్లా ఎస్ఈగా పనిచేస్తున్న వెంకటేశ్వర్లును నల్లగొండకు బదిలీచేయడంతో ఈ మేరకు బాధ్యతలు తీసుకున్నారు. ఆయన గతంలో జిల్లాలో వివిధ హోదాల్లో పనిచేసి మహబూబ్‌నగర్ జిల్లాకు బదిలీపై వెళ్లారు. తాజాగా, ఎస్ఈగా బాధ్యతలు తీసుకోవడంతో ఆయన్ను పలువురు అధికారులు, విద్యుత్ సంఘాల నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

- (ఆంధ్రజ్యోతి, నల్లగొండ టౌన్)



బండెక్కిన ఎమ్మెల్యే

బురద పొలంలో దిగి నారు పంచడం.. మహిళలతో నాట్లేస్తూ ఉత్సాహపరచడం.. దారెంట వెళ్తున్న కూలీలను పలకరిస్తూ వార్తల్లో నిలిచే తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు మరోసారి తన ప్రత్యేకత చాటుకున్నారు. శుక్రవారం అడ్డగూడూరు మండలంలోని జానకిపురం గ్రామంలో దుర్గమ్మ గుడి నుంచి ప్రభుత్వ పాఠశాల వరకు ఇలా ఎడ్లబండి నడిపారు. ఆ తరువాత బిక్కేరు వాగులో ప్రవహిస్తున్న గోదావరి జలాలకు పూజలు చేశారు. ● అడ్డగూడూరు

మూసీ మురిసేలా..

ప్రక్షాళిస్తాం



నల్లగొండ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కాలుష్య కాసారంగా మారిన మూసీ నదిని పునరుజ్జీవింపజేయడం తక్షణ కర్తవ్యమని ఉమ్మడి నల్లగొండ జిల్లా నేతలు అభిప్రాయపడుతున్నారు. మూసీ ప్రక్షాళన కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కార్యాచరణ సఫలం అయితేనే ఉమ్మడి జిల్లా మూసీ పరివాహక రైతాంగ కన్నీటి బాధలు తీరుతాయని అంటున్నారు. ఒకవైపు మురికి నీరు, మరో వైపున పరిశ్రమల వ్యర్థాల కలయికతో మూసీ నీరు విషతుల్యమైందని ఆవేదన వ్యక్తం చేశారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో ఉమ్మడి జిల్లాలో మూసీ పరివాహకంలో ఈ నీటితోనే సేద్యం చేసి పండిన పంటని ఇక్కడ అమ్ముకోలేని, తినలేని దయనీయ స్థితిని ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మూసీ నది పునరుజ్జీవానికి రాజకీయలకతీతంగా అందరూ మద్దతు పలకాలని పిలుపునిచ్చారు. మూసీ పరివాహక ప్రజల కష్టాలపై ఆంధ్రజ్యోతి వరుస కథనాలు ప్రసంశనీయమని , సామాజిక బాధ్యతగా పత్రిక విషయాలని వెల్లడించడం అభినందనీయమని పలువురు నేతలు

మిగతా 6వ పేజీలో...

మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టుతో నల్లగొండ రైతులకు ఉపశమనం



మూసీ నది కాలుష్యంతో నల్లగొండ జిల్లా ప్రజలు ఎన్నో అవస్థలు ఎదుర్కొంటున్నారు. ఆ బాధ ఇక్కడి జనాలకి తెలుసు. ఆ కాలుష్యం నీళ్లను వాడి, తాగి ఇక్కడి జనం క్యాన్సర్, ఊపిరితిత్తుల వ్యాధులకు గురవుతున్నారు. మూసీ ప్రక్షాళన కోసం నేను గతంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కూడా కొట్లాడితే అప్పటి కేసీఆర్ సర్కార్ పట్టించుకోలేదు. భువనగిరి ఎంపీగా ఉన్నప్పుడు కూడా మూసీ ప్రక్షాళనను నమో గంగా తరహాలో చేపట్టాలని కేంద్రాన్ని కోరా. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు చేపట్టాం. దీనికి రాజకీయాలకతీతంగా అందరూ సహకరించాలి. ఈ ప్రాజెక్టుపై రాజకీయాలు చేయవద్దు. దీన్ని అడ్డుకోవాలని చూస్తున్న ప్రతిపక్ష నాయకులు కొన్నాళ్లు మూసీ పరివాహకంలో నివసిస్తే వారికి బాధలు అర్థమవుతాయి. ఎవరు అడ్డుకోవాలని ప్రయత్నించినా కాంగ్రెస్ ప్రభుత్వం మూసీని పునరుజ్జీవింపజేసి నల్లగొండ జిల్లా ప్రజల బాధలు తీరుస్తుంది. అప్పటివరకు మేం విశ్రమించేది లేదు. నల్లగొండ రైతులకు న్యాయం చేయడమే నా జీవితకాల ఆకాంక్ష అందుకోసం ఎంతవరకైనా పోరాడతా.

- కోమటిరెడ్డి వెంకటరెడ్డి, రోడ్లు, భవనాల శాఖ మంత్రి

గోదావరి జలాలను మూసీకి తరలిస్తాం



మూసీ నదిని పునరుజ్జీవింపచేయడం ద్వారా ఈ నది నీటితో నల్లగొండ జిల్లాలోని ఆయకట్టుకు స్వచ్ఛమైన నీటిని అందిస్తాం. మూసీనదిలోకి గోదావరి జలాలను తీసుకొస్తాం. అందుకోసం ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం. మూసీ నది కింద జిల్లాలో ఉన్న బునాదిగాని కాల్వ పునరుద్ధరణకు రూ.266.65కోట్ల నిధులు కేటాయించాం. అదేవిధంగా పిలాయిపల్లి, ధర్మారెడ్డిపల్లి కాల్వలకు కూడా రూ.211 కోట్ల నిధులిస్తాం. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మూసీ నదిని జీవనదిగా మార్చి కాల్వల ద్వారా, ప్రాజెక్టు ద్వారా సుమారు 1.40లక్షల ఎకరాలకు సాగునీరిస్తాం. మూసీ పరివాహక రైతులకు ఉపశమనం కలిగించేలా ఈ ప్రాజెక్టు చేపట్టాం. ఉమ్మడి జిల్లాలో మూసీ పరివాహక రైతులకు స్వచ్ఛమైన జలాలందించడమే అంతిమ లక్ష్యంగా కార్యాచరణ కొనసాగిస్తాం.

- ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, భారీ నీటిపారుదలశాఖ మంత్రి

మూసీ నది పునరుజ్జీవ ప్రాజెక్టును చేపట్టాల్సిందే



మూసీ నది పునరుజ్జీవ ప్రాజెక్టు కోటి మంది జనాలకు ఉపయుక్తమయ్యే పథకం. దీన్ని రాజకీయ కోణంలో ప్రతిపక్షాలు అడ్డుకోవడం సమంజసం కాదు. ఈ ప్రాజెక్టును అడ్డుకుంటే ఉమ్మడి జిల్లాలోని రైతులంతా ఉద్యమిస్తారని హెచ్చరిస్తున్నాం. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కూడా ఈ పథకాన్ని చేపట్టిన విషయం గుర్తుంచుకోవాలి. ఉమ్మడి జిల్లాలోని మూసీపరివాహక ప్రాంత రైతులకు నష్టం కలిగిస్తే సహించేది లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం మ్యానిఫెస్టోలో పెట్టకపోయినా, మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టును చేపట్టినందుకు సీఎం రేవంత్‌రెడ్డిని, ప్రభుత్వాన్ని అభినందించాల్సింది పోయి విమర్శలు చేయడం దురదృష్టకరం.

- చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, భువనగిరి ఎంపీ

మూసీ ప్రక్షాళనకు అందరూ సహకరించాలి



ఔటర్ రింగ్ రోడ్డుతో హైదరాబాద్ ఎంతగా అభివృద్ధి చెందిందో... మూసీ నదిని ప్రక్షాళన చేస్తే ఇంకా వేగంగా అభివృద్ధి చెందుతుంది. మూసీ ప్రక్షాళన చేస్తే రైతులు, ప్రజలు సుభిక్షంగా ఉంటారు. ప్రతిపక్షాలు రెచ్చగొట్టే మాటలతో మూసీ పరివాహక ప్రాంతంలోని ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు. మూసీ రివర్ బెడ్‌పై ఉన్న ఇళ్లు పోతున్న వారికి బాధ ఉంటుంది. ప్రభుత్వం వారికి అన్ని రకాలుగా అండగా ఉంటుంది. మూసీ ప్రక్షాళనకు సహకరించాలి. ఉమ్మడి నల్లగొండ జిల్లాకు మూసీ నదితో అందరికీ మేలు జరుగుతుంది.

- కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, భువనగిరి ఎమ్మెల్యే

మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు చేపట్టాల్సిందే



- రాజకీయాల కోసం అడ్డుకుంటే ప్రజలు క్షమించరు
- శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

రోగాలు నయం చేసిన నీరు రోగాల పాల్జేస్తోంది : తుంగతుర్తి ఎమ్మెల్యే సామేలు


మూసీ ప్రక్షాళన చారిత్రక అవసరం: నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం

6లో..

ఆంధ్రజ్యోతి మూసీ మురిసేనా 5



ఎంజీయూ వీసీగా అల్తాఫ్ హుస్సేన్



నల్లగొండ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయానికి నూతన వీసీ (ఉపకులపతి)గా అల్తాఫ్ హుస్సేన్‌ను నియమిస్తూ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా తొమ్మిది విశ్వవిద్యాలయాలకు ఉపకులపతులను నియమించారు. అందులో భాగంగా అల్తాఫ్ హుస్సేన్ నియమితులయ్యారు. ఆయన గతంలో 2016 జూలై నుంచి 2019 జూన్ 29వ తేదీ వరకు ఎంజీయూ వీసీగా సేవలందించారు. ఎంజీయూ మొట్టమొదటి న్యాక్ అక్రిడేషన్‌కు ఆయన నాయకత్వం వహించి బీ-గ్రేడ్ సాధనకు కృషి చేశారు. ఆయన హయాంలో ఇంజనీరింగ్ కళాశాల, స్పోర్ట్స్ కాంప్లెక్స్, అదనపు హాస్టల్స్, పరీక్షల విభాగం భవనాలకు శంకుస్థాపనలు చేశారు. సుదీర్ఘ అనుభవం ఉన్న అల్తాఫ్ హుస్సేన్ నియామకంపై పలువురు అధికారులు, అధ్యాపకులు హర్షం వ్యక్తం చేశారు.

కష్టపడి ఎదిగిన అల్తాఫ్ హుస్సేన్

మహాత్మాగాంధీ యూనివర్సిటీ వైస్‌ఛాన్సలర్‌గా నియమితులైన ప్రొఫెసర్ అల్తాఫ్ హుస్సేన్ కష్టపడి ఎదిగారు. వరంగల్ జిల్లా ఆత్మకూరుకు చెందిన ఆయన తండ్రి పూర్వపు ఆజంజాహి మిల్లులో చిరుద్యోగి. వరంగల్ కాకతీయ యూనివర్సిటీలోనే బీఎస్సీ, ఎంఎస్సీ (ఫిజిక్స్) చేసిన అల్తాఫ్ హుస్సేన్ పీజీలో టాపర్‌గా, గోల్డ్‌మెడలిస్ట్‌గా నిలిచారు. అనంతరం అదే యూనివర్సిటీలో పీహెచ్‌డీ కూడా చేశారు. కాకతీయ యూనివర్సిటీలో 1982లో అడ్‌హక్ లెక్చరర్‌గా ప్రారంభమైన ఆయన ఉద్యోగ జీవితం బోధకుడిగా, పరిశోధకుడిగా సాగింది. అనంతరం లెక్చరర్‌గా, సీనియర్ స్కేల్ లెక్చరర్‌గా, రీడర్ కమ్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా, ఆ తరువాత ప్రొఫెసర్‌గా కొనసాగారు. ఆ సమయంలోనే ఫిజిక్స్ విభాగాధిపతిగా, సీనియర్ ప్రొఫెసర్‌గా, పరీక్షల విభాగం, ఇతర పలు విభాగాల ఇన్‌చార్జిగా పనిచేశారు. నల్లగొండ ఎంజీ యూనివర్సిటీకి 2016-19లో ఆయన వీసీగా పనిచేశారు. అనంతరం మళ్లీ కేయూకి వెళ్లిన ఆయన ఇప్పటివరకు అక్కడ ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా పనిచేశారు. తన పరిశోధనల్లో భాగంగా ఆయన 40 జర్నల్స్‌ను ప్రచురించారు. 1989లో సోవియట్ రష్యాలోనూ కొంతకాలం పరిశోధనలు సాగించారు. ఆయన సతీమణి కూడా ఉస్మానియా యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా పనిచేస్తుండగా, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు కూడా ఉన్నతవిద్యాభ్యాసం చేసి, వేర్వేరు రంగాల్లో స్థిరపడ్డారు. మహాత్మాగాంధీ యూనివర్సిటీ పురోభివృద్ధికి తోడ్పడ్డ అల్తాఫ్ హుస్సేన్ మరోసారి వైస్‌ఛాన్సలర్‌గా రావడంపై యూనివర్సిటీ అధికారులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

పునరావాస గ్రామాల్లో సమస్యలు పరిష్కరిస్తాం

అదనపు కలెక్టర్ శ్రీనివాస్



గట్టుమీదితండాలో రైతులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్

తిరుమలగిరి(సాగర్), అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ప్రాజెక్టు ముంపు బాధితులకు పునరావాసం కల్పించిన గ్రామాల్లో భూ సమస్యలు పరిష్కరిస్తామని అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం రెవెన్యూ పైలట్ ప్రాజెక్టులో భాగంగా నిర్వహిస్తున్న సర్వేను ఆయన పర్యవేక్షించారు. పునరావాస గ్రామాలైన ఎల్లాపురం రెవెన్యూ శివారులోని సుంకిశాల తండా, నేతాపురం రెవెన్యూ పరిధిలోని గట్టుమీదితండాల్లో ఆయన పర్యటించి అక్కడి రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలపై చర్చించారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టులో సారవంతమైన భూములు కోల్పోయామని, వ్యవసాయానికి, జీవనానికి అనువుగా లేని అటవీ ప్రాంతంలో 1974-75లో తమకు అప్పటి ప్రభుత్వం పునరావాసం కల్పించిదని రైతులు వివరించారు. గుట్టలను చదును చేసుకొని వ్యవసాయం చేస్తున్నామని, అప్పట్లో డీ-ఫాం పట్టాలు ఇచ్చినా, సంబంధిత వివరాలు రెవెన్యూ రికార్డుల్లో పొందుపరచలేదని అన్నారు. దీంతో భూములపై హక్కులు లేక ప్రభుత్వ సబ్సిడీలు, వ్యవసాయ రుణాలు, రైతుబంధు వంటి పథకాలు పొందలేకపోతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశాఉరు. వివాదంలో ఉండడంతో నిత్యం ఫారెస్ట్ అధికారులతో సమస్యలు ఎదుర్కొంటున్నామని వివరించారు. వెంటనే తమ భూ సమస్యలు పరిష్కరించాలని అధికారులను రైతులు కోరారు. గట్టుమీదితండాకు సంబంధించి 223 ఎకరాలకు, సుంకిశాలతండాకు సంబంధించి 190 ఎకరాలకు డీ-ఫాం పట్టాలు పొందిన రైతుల వివరాలు లభ్యమయ్యాయని, రైతులు వారి వద్ద ఉన్న పట్టాలను అధికారులకు అందజేయాలని అదనపు కలెక్టర్ సూచించారు. ఫారెస్ట్, రెవెన్యూ జాయింట్ సర్వే నిర్వహించి శాశ్వత పరిష్కారం చూపుతామని రైతులకు ఆయన హామీ ఇచ్చారు. సర్వేకు రైతులు సహకరించాలని కోరారు. ఆయన వెంట స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుబ్రహ్మణ్యం, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ శ్రీనివాస్, డీఐ రమణయ్య రమాకాంత్‌రెడ్డి, శ్రీను, సందీప్, కృష్ణయ్య, సర్వేయర్లు విజయ్, లక్ష్మణ్, ఖదీర్, స్వప్న, వెంకటేశ్వర్లు, నాయకులు మేరావత్ మునినాయక్, సపావత్ బద్రినాయక్, రామకృష్ణనాయక్, శంకర్‌నాయక్, సేవానాయక్, జబ్బార్‌నాయక్, తదితరులు ఉన్నారు.

21 నుంచి పోలీసు అమరుల సంస్మరణ వారోత్సవాలు

ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ రూరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): పోలీసు అమరుల సంస్మరణ వారోత్సవాలు ఈనెల 21 నుంచి నిర్వహించనున్నట్టు ఎస్పీ శరత్‌చంద్ర పవార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా విధి నిర్వహణలో అమరులైన పోలీసుల ప్రాణత్యాగాలను స్మరించుకుంటూ ఈ నెల 21న ఫ్లాగ్‌డే (పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం) నిర్వహిస్తామన్నారు. అదేవిధంగా ఓపెన్ హౌస్, రక్తదాన శిబిరం, సైకిల్ ర్యాలీ, ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ, షార్ట్‌ఫిల్మ్, వ్యాసరచన పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమాల్లో విద్యార్థులు, యువకులుపాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

రిజిస్టర్లను సక్రమంగా నిర్వహించాలి

డీఎంహెచ్‌వో శ్రీనివాస్



రిజిస్టర్లను పంపిణీచేస్తున్న డీఎంహెచ్‌వో శ్రీనివాస్

చిట్యాల, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆశా కార్యకర్తలు వారికిచ్చిన రిజిస్టర్ల ను సక్రమంగా నిర్వహించాలని డీఎంహెచ్‌వో పుట్ల శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం స్థానిక పీహెచ్‌సీకి ప్రభుత్వం నుంచి కొత్తగా వచ్చిన ఆశా కార్యకర్తల రిజిస్టర్‌ను ఈ సందర్భంగా వారికి అందజేశారు. అనంతరం మాట్లాడుతూ, ఆశా కార్యకర్తలు అంకితభావంతో పనిచేస్తూ రోగులకు మెరుగైన సేవలందించాలన్నారు. టీకాల కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలన్నారు. అనంతరం ఆస్పత్రిలోని రక్త పరీక్షల రిజిస్టర్‌ను ఆయన తనిఖీచేశారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, డీఐవో పద్మ, ప్రాజెక్ట్ ఆఫీసర్ డాక్టర్ కృష్ణకుమారి, జిల్లా టీబీ నియంత్రణ అధికారి కళ్యాణ్ చక్రవర్తి, వైద్యాధికారి వెంకటేశం, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యానికి మద్దతు ధర

» ఐకేపీల ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేస్తుంది » అపోహలకు గురికావద్దు » కలెక్టర్ సి.నారాయణరెడ్డి



అవంతీపురం మార్కెట్ యార్డులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, చిత్రంలో కలెక్టర్ నారాయణరెడ్డి

మిర్యాలగూడ, మిర్యాలగూడ రూరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ధాన్యాన్ని ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేస్తుందని కలెక్టర్ సి. నారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం అవంతీపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ, రాష్ట్రంలో అత్యధికంగా జిల్లాలో ధాన్యం సేకరించేందుకు అన్ని ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో సన్నరకం, దొడ్డురకం ధాన్యం కొనుగోలుకు వేర్వేరు కేంద్రాలు ఏర్పాటుచేశామని, మొత్తం 375 కేంద్రాలకు ఇప్పటికే 185 కేంద్రాలు ప్రారంభించామన్నారు. రెండు రోజుల్లో మిగతా వాటిని తెరుస్తామన్నారు. దీపావళి తరువాతే ఎక్కువగా పంట నూర్పిడి అవుతుందని, అందుకు తగ్గట్టు ఐకేపీ కేంద్రాల్లో గన్నీ బ్యాగులు, తూ కం యంత్రాలు ఏర్పాటుచేస్తామన్నారు. ఏ-గ్రేడ్ రకానికి క్వింటా రూ.2,320, బీ-గ్రేడ్ రకానికి రూ.2,300గా ప్రభుత్వం మద్దతు ధరగా నిర్ణయించిందన్నారు. అదేవిధంగా క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తోందన్నారు. ప్రతి గ్రామానికో కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నందున రైతులు మిల్లు పాయింట్ల వద్ద తక్కువ ధరకు విక్రయించాల్సిన అవసరం లేదన్నారు. రైతులు అపోహలకు గురికావద్దని, ధాన్యం విక్రయాల్లో సమస్యలు ఎదురైతే కంట్రోల్ రూం నెంబరు 9963407064కు ఫోన్ చేసి తెలియజేయాలన్నారు. తక్కువ ధరకే ధాన్యాన్ని కొనుగోలుచేస్తున్నారనే వార్తలను రైతులు నమ్మవద్దని సూచించారు.

ఇబ్బందులు కలగజేస్తే మిల్లర్ల లైసెన్స్ రద్దు చేస్తాం : బీఎల్ఆర్

ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, ధాన్యం ధర విషయంలో రైతులు నష్టపోకుండా చూస్తామన్నారు. ధర, తూకం విషయంలో ఇబ్బందులు కలగజేస్తే మిల్లర్ల లైసెన్స్ రద్దు చేసి సీజ్ చేస్తామని హెచ్చరించామన్నారు.

ఏటీసీలలో ప్రవేశాలకు ప్రభుత్వ అనుమతి

నిరుద్యోగ యువతకు వివిధ వృత్తుల్లో నైపుణ్యాలను పెంపొందించి, ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం ఏర్పాటుచేసిన అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్లలో(ఏటీసీ) ఈ ఏడాది నుంచి ప్రవేశాలకు అనుమతి లభించిందని కలెక్టర్ నారాయణరెడ్డి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ నుంచి నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. జిల్లాలో మొత్తం నాలుగు ఏటీసీలకు నల్లగొండలో బాలుర, అనుముల, డిండి కేంద్రాలకు అనుమతి వచ్చిందన్నారు. యువతీ యువకులు ఈనెల 30లోగా ఆయా కోర్సులకు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఒక్కో కేంద్రంలో 172 సీట్లు ఉంటాయని, ఆరు సంవత్సర కాలవ్యవధి కోర్సులు, రెండు రెండేళ్ల కాల వ్యవధి కోర్సులు ఉంటాయన్నారు. పదోతరగతి ఉత్తీర్ణులైన వారు వీటికి అర్హులని తెలిపారు. ఒక్కో కళాశాలకు నోడల్ అధికారిని నియమిస్తున్నట్టు ఆయన తెలిపారు. నల్లగొండ కేంద్రానికి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, అనుములకు డీఈవో, డిండి కేంద్రానికి జిల్లా ఇంటర్మీడియట్ అధికారి ఇన్‌చార్జిగా వ్యవహరిస్తారని తెలిపారు. టెలీకాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ టి.పూర్ణచంద్ర, డీఈవో భిక్షపతి, ఇంటర్మీడియట్ అధికారి దస్రునాయక్ పాల్గొన్నారు.

అవగాహన మరచి

6లో..

నిరుపయోగంగా మార్చి

అవగాహన మరచి

నిరుపయోగంగా మార్చి

● స్టీల్ బ్యాంక్‌కు ఆదరణ కరువు



సూర్యాపేట జిల్లా కేంద్రంలోని గణేష్‌నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల-2వద్ద మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టీల్‌బ్యాంక్

సూర్యాపేటటౌన్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా కేంద్రంలో మునిసిపాటిలోని మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టీల్ బ్యాంక్ అవగాహన లేక నిరుపయోగంగా మారింది. లక్షల రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేసిన స్టీల్ బ్యాంక్ వృథాగా నిలిచింది. మునిసిపాలిటీ పరిధిలో ప్లాస్టిక్ నిర్మూలించాలనే లక్ష్యంతో స్టీల్ సామగ్రి కోసం మెప్మా ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో రెండు స్టీల్‌బ్యాంక్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. అయితే అనుకున్న లక్ష్యం నేరవేరేలా ప్రజల్లో అవగాహన కల్పించకపోవడంతో స్టీల్‌బ్యాంక్‌కు ఆదరణ లేకుండాపోయింది. అసలు చాలా మందికి స్టీల్‌బ్యాంక్ ఉన్న విషయం కూడా తెలియకపోవడం గమనార్హం. జిల్లా కేంద్రంలోని గణేష్‌నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల-2 సమీపంలో ఒక్కో స్టీల్‌బ్యాంక్‌ను రూ.6.34 లక్షలతో రెండు స్టీల్‌బ్యాంకులను ఒకే చోట ఏర్పాటు చేశారు.

అవగాహన కల్పించడంలో వైఫల్యం

జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన రెండు స్టీల్ బ్యాంక్‌ల్లో సుమారుగా రెండు ఫంక్షన్లకు సరిపడా స్టీల్ సామగ్రి ఉంది. స్టీల్‌బ్యాంక్‌లో ప్లేట్లు, గ్లాసులు, స్వీట్ కప్పులు, టీగ్లాసులు, టిఫిన్‌ప్లేట్లు, పెద్దపెద్ద వంట పాత్రలు ఇలా 26 రకాలకుపైగా స్టీల్ సామగ్రి ఉంది. అంతాబాగానే ఉన్నా దీనిపై ప్రచారం లేకుండాపోయింది. ఈ స్టీల్ బ్యాంక్‌లను ప్రారంభించి 11నెలలు కావొస్తున్నా, సామగ్రి వినియోగం మాత్రం అంతగా లేదు. అంతేగాక ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా ఐదుచోట్ల ఈ స్టీల్ బ్యాంకులను ఏర్పాటు చేశారు. భువనగిరి, నల్లగొండ, మిర్యాలగూడ మునిసిపల్ కేంద్రాల్లో వీటిని ఏర్పాటు చేశారు.

అవగాహన కల్పిస్తేనే ఫలితం

ఇటీవల ఏర్పాటు చేసిన వినాయకచవితి, దుర్గామాత మండపాల వద్ద అన్నదానం కార్యక్రమాలు నిత్యం నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో వందల రూపాయలు ప్లాస్టిక్ గ్లాస్‌లు, పేపర్ ప్లేట్ల కోసం ఉపయోగించారు. అధికారులు అవగాహన కల్పించి ఉంటే అక్కడ స్టీల్‌ప్లాంట్ సామగ్రి ఉపయోగపడేది. అంతేగాక పెళ్లిళ్లు, శుభకార్యక్రమాలకు స్టీల్‌బ్యాంకును వినియోగించే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం మంచి ముహూర్తాలు ఉన్నందున రానున్న రోజుల్లో పలు పెళ్లిళ్లు, పండుగలకు వీటిని వినియోగించేలా ప్రజల్లో అవగాహన కల్పించాలని పలువురు కోరుతున్నారు. అయితే ఈ స్టీల్‌బ్యాంకులో వంటసామగ్రి ఉన్నా, టెంట్ లేకపోవడంతో ఆదరణ కరువైందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. టెంట్‌హౌస్ కోసం వెళ్లిన ప్రజలు మిగిలిన సామగ్రిని సైతం కిరాయికి తీసుకుంటున్నారని అధికారులు చెబుతున్నారు. ఏది ఏమైనా లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన స్టీల్ సామగ్రి ప్రజలకు అవగాహన లేక నిరుపయోగంగా మారుతోంది. దీన్ని వినియోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

అవగాహన కల్పిస్తాం

మునిసిపాలిటీ పరిధిలో ఏర్పాటు చేసిన స్టీల్‌బ్యాంక్ ఉపయోగంపై ప్రజలకు అవగాహన కల్పిస్తాం. ఇప్పటికే కరపత్రాలు పలు ఫంక్షన్‌హాళ్లలో ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. వార్డుల్లో మహిళా సంఘాలతో స్టీల్‌బ్యాంక్ ఉపయోగంపై ప్రజలకు వివరిస్తాం.

బి.శ్రీనివాస్, సూర్యాపేట మునిసిపల్ కమిషనర్

అమ్మ చేసిన ఒరుగులు... కీర్తిప్రియ ఆలోచనకు పునాదిగా నిలిచాయి. అదేసమయంలో రైతులు డిమాండ్ లేని పంటలు సాగు చేసి నష్టపోవడాన్ని గమనించారామె... ఐఐఎంలో చదివి రూ.లక్షల వేతనం వస్తున్నా ఆమె ధ్యాసంతా సొంతంగా వ్యాపారం చేయడమే. అందులోంచి పుట్టిందే 'కో, నర్చర్ ఫీల్డ్స్'.. కూరగాయలను ఎండబెట్టి ఒరుగులుగా తీర్చిదిద్దడమే ఆమె వ్యాపారం. మొదట్లో ఎన్నో ఒడిదొడుకులు ఎదుర్కొని నేడు ఇతర దేశాలకు ఎగుమతి చేసే వరకూ వెళ్లింది.. ఈ క్రమంలో కష్టనష్టాలను ఎదుర్కొంది.. ఇటీవలే రాష్ట్ర స్థాయి ఉత్తమ పారిశ్రామిక వేత్తగా అవార్డునూ తెచ్చింది. ఆమె ప్రస్థాన ప్రయాణం..

(ఆంధ్రజ్యోతి- తిరుమలగిరి రూరల్)



నర్చర్ కంపెనీలో కూరగాఆయాలను ప్రాసెసింగ్ చేస్తున్న మహిళలు

ఎందరి‘కో’ స్ఫూర్తి..

koh!

● కూరగాయల పొడుల తయారీ కంపెనీ నర్చర్ ఫీల్డ్స్ స్థాపించిన కీర్తిప్రియ
● అమ్మ పంపించే ఒరుగులే ఆలోచనకు పునాది
● కో పేరుతో మార్కెట్‌లో ఉత్పత్తులు

సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండలం తొండ గ్రామానికి చెందిన ఓడపల్లి వెంకన్న, విజయలక్ష్మీ దంపతులకు ముగ్గురు అమ్మాయిలు. ఓ వైపు కానిస్టేబుల్‌గా చేస్తూనే మరోవైపు వ్యవసాయం చేసేవాడు. రెండో కుమార్తె కీర్తిప్రియ కోల్‌కత్తాలో ఐఐఎం పూర్తిచేసింది. వ్యవసాయమంటే ఆమెకు ఎంతోమక్కువ. ఉద్యోగం చేస్తూనే వ్యవసాయంలో తండ్రికి తోడుగా ఉండేది. ఎప్పుడు ఊరికి వచ్చినా పొలానికి వెళ్తుండేది. ఈ క్రమంలో వ్యవసాయంలో మెళకువలు, ఇబ్బందులు తెలుసుకుంది.

అమ్మ చేతి ఒరుగులు...



తల్లి విజయలక్ష్మి, కంపెనీలో పనిచేసే మహిళలతో కీర్తిప్రియ

ఐఐఎంలో చదువు పూర్తయ్యాక కీర్తిప్రియ ఉద్యోగరీత్యా బెంగళూరులో ఉంది. లోకల్ యాప్ వ్యవస్థాపనలో కీలకంగా వ్యవహరించింది. ఆ తర్వాత రూ.40లక్షల ఉద్యోగంలో చేరింది. అయినప్పటికీ ఏదో వెలితి ఆమెను సొంత వ్యాపారం వైపు మళ్లించింది. తన కోసం ఇంటి నుంచి అమ్మ పంపిస్తున్న ఎండిన కూరగాయలతో తయారుచేసిన పొడులు రుచికరంగా ఉండటాన్ని గమనించింది. గ్రామంలో ఒకసారి రైతులు కూరగాయలను ధరలేదని పారబోయడం గమనించింది. వారు అలా నష్టపోకూడదని భావించింది. వెంటనే వ్యవసాయ ఉత్పత్తులతో ఒరుగుల తయారీపై పూర్తిగా స్టడీచేసింది. రెండు నెలల పాటు గ్రామాల్లో తిరుగుతూ రైతులతో మాట్లాడింది. సేంద్రీయ సాగుపై అవగాహన కల్పించింది. అనంతరం 2018లో రూ2 లక్షలతో తొండ గ్రామంలో 'నర్చర్ ఫీడ్స్' పేరుతో ఆర్గానిక్ వ్యవసాయ ఆహార ఉత్పత్తుల కంపెనీని ప్రారంభించింది. సోలార్ డ్రైయర్‌ను ఏర్పాటు చేసి కూరగాయలను ఎండబెట్టి, పొడులుగా మార్చి కో(కేవోహెచ్)' పేరుతో విక్రయించేది. కంపెనీ నిర్వహణలో తల్లి విజయలక్ష్మి సహకారం తీసుకునేది. మహిళా కూలీలతో కూరగాయలు ముక్కలుగా కోయించి వారం పాటు ఎండబెట్టి ఆ తర్వాత పొడిగా మార్చి ప్యాకింగ్ చేయించి విక్రయానికి సిద్ధం చేయించి, మార్కెట్‌కు పంపిస్తుంది.

మలుపుతిప్పిన కరోనా కష్టాలు

కరోనా సమయంలో కీర్తిప్రియ ముంబాయిలో ఉంది. అక్కడి నుంచి రాగానే కంపెనీపై దృష్టి సారించింది. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేసిన 'వీ-హబ్'లో చేరింది. పోలీసుల్లో ఇమ్యూనిటీ పెంచేందుకు 30క్వింటాళ్ల ఉసిరికాయలను పొడులుగా మార్చి ఇచ్చే బాధ్యతను ప్రస్తుత ఆర్టీసీ ఎండీ సజ్జనార్ అప్పగించారు. అదే మొదటి భారీఆర్డర్. దానిని విజయవంతం చేయడంతో ఆమెకు 'వీ హబ్' నుంచి రుణ సదుపాయాన్ని కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందుకువచ్చింది. బ్యాంక్ రుణంతో నర్చర్ ఫీల్డ్స్‌ను మరింత విస్తృతం చేసింది. పూర్తిగా సేంద్రీయ సాగుతో ఉత్పత్తులను తయారుచేస్తోంది. టమాట, దోసకాయ, గోంగూర, పాలకూర, మునగాకు, ఉసిరి, కరివేపాకు, మెంతికూర, క్యారెట్, బీట్‌రూట్ లాంటి కూరగాయలు, ఆకుకూరలను పొడులుగా మార్చి తక్కువ ధరకు విక్రయిస్తోంది. అమెజాన్, బిగ్‌బజార్, మాల్స్, స్టాల్స్‌లో విక్రయాలను ఇంతింతై అన్నట్లుగా లక్షల్లో ఉన్న వ్యాపారాన్ని రూ.3 కోట్లకు చేరింది. ప్రస్తుతం అమెరికా, దుబాయ్ దేశాలకు ఎగుమతి చేస్తోంది. వ్యాపారాన్ని ఏడాదికి రూ.2.5 కోట్ల టర్నోవర్‌కు చేర్చింది కీర్తిప్రియ. సుమారు 40 మంది మహిళలకు ఉపాధి కల్పిస్తోంది. ఇటీవలే 2023లో ఉత్తమ మహిళా పారిశ్రామికవేత్త అవార్డును రాష్ట్ర ప్రభుత్వం నుంచి అందుకుంది.

అమ్మనాన్నల ప్రోత్సాహంతోనే..



నా ఆలోచనలకు తల్లిదండ్రుల సహకారం తోడైంది. వ్యాపార నిర్వహణలో ఎన్నో ఒడిదొడుకులు ఎదుర్కొన్నా. డిమాండ్ లేని ఉత్పత్తులు సాగు చేసి రైతులు నష్టపోవడం చూశా. ముఖ్యంగా హెర్బల్ ప్రొడక్ట్స్‌లో ప్రతిదీ రైతు పండించేదే. కానీ మార్కెట్ విధానం తెలియక రైతులు మోసపోతున్నారు. ప్రభుత్వం రైతులకు పండించే పంటలపై అవగాహన కల్పించి ప్రోత్సహిస్తే అధిక లాభాలు పొందవచ్చు.

-కీర్తిప్రియ, నర్చర్ ఫుడ్ ఫౌండర్

నెమలికి నేర్పిన

నడకలితో



యాదాద్రిభువనగిరి జిల్లా మోటకొండూరు మండలం కాటేపల్లికి చెందిన ఎనిమిదేళ్ల యెలగందు ఉషస్వి సాంప్రదాయ నృత్యాల్లో రాణిస్తోంది. ఎన్నోవేదికలపై ప్రదర్శనలు ఇస్తూ ప్రశంసలు అందు కుంటోంది. తల్లి వసంత గృహిణి కాగా తండ్రి మునిసిపల్ కార్యాలయంలో పనిచేస్తుంటాడు. ఓ ప్రైవేట్ పాఠశాలలో 3వ తరగతి చదువుతున్న ఉషస్వి చిన్నతనంలో టీవీలో వచ్చే నృత్యాలను అనుకరించేది. దీంతో తల్లిదండ్రులు నాలుగేళ్ల వయసులోనే నృత్య కళాక్షేత్రంలో చేర్పించారు. గురువు పసుపులేటి సరిత వద్ద ఓనమాలు నేర్చుకుని అనతి కాలంలోనే నాట్యంలో నైపుణ్యాన్ని ప్రదర్శిస్తూ ఎన్నో అవార్డులను సొంతం చేసుకుంది. చదువులోనూ చురుకుదనాన్ని ప్రదర్శిస్తూ చదవులోనూ రాణిస్తోంది.



ఉషస్వి సాధించిన అవార్డులు

ప్రదర్శనలు

●ముచ్చింతల్‌లోని శ్రీరామనుజ సహస్రాబ్ది చినజీయర్‌స్వామి ఆశ్రమంలో ● భద్రాచలంలో నిర్వహించిన భద్రాద్రి సంగీత విభావరిలో ●తిరుపతిలోని రాయలసీమ రంగస్థలి మహతి ఆడిటోరియంలో ● 2022లో కాశీలో నిర్వహించిన ఉత్సవంలో ● ఉస్మానియా యూనివర్సిటీలో కళాపీఠ్ సాంస్కృతిక కార్యక్రమంలో ● యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయం, భద్రాద్రి సాంస్కృతిక వారధి సందర్భంగా నృత్య ప్రదర్శనలు ఇచ్చింది. ఇప్పటివరకు వివిధ రాష్ట్రాల్లో 20కి పైగా ప్రదర్శనలు ఇచ్చింది.

అవార్డులు

● 2023లో గచ్చిబౌలిలో గిన్నిస్ వరల్డ్ రికార్డు కోసం నిర్వహించిన నృత్య ప్రదర్శనలో పాల్గొన్న పాల్గొంది.
●గుంటూరు జిల్లా చిలుకలూరిపేట నుంచి నవరస భరతనాట్యమయూరి అవార్డు.
● శ్రీశాంతి కృష్ణ సేవాసమితి(హైదరాబాద్) ఆధ్వర్యంలో స్వర్ణ నంది పురస్కారం.
●హైదారబాద్‌లోని రవీంద్ర భారతిలో నిర్వహించిన అంతర్జాతీయ మాతృభాష, తెలంగాణ సరస్వతీ పరిషత్ ఆధ్వర్యంలో నంది అవార్డును సొంతం చేసకుంది.

(మోటకొండూరు -ఆంధ్రజ్యోతి)



తమిళనాడులోని గోల్డెన్ టెంపుల్‌లో ఇచ్చిన ప్రదర్శనకు ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న నిర్వాహకులు

● కాటమయ్యకు జలబిందెలు



ఊరేగింపులో పాల్గొన్న కంఠమహేశ్వర స్వామి మాలధారులు

చౌటుప్పల్ రూరల్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): యాదాద్రి జిల్లా చౌటుప్పల్ మండలం దండుమల్కాపురంలో కంఠమహేశ్వరస్వామి సురమాంబదేవి కల్యాణ మహోత్సవాల సందర్భంగా శుక్రవారం మాలధారులు, గౌడకులస్థులు ఇంటికో జల బిందెలతో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం కంఠమహేశ్వరస్వామికి అభిషేకించారు. కుటుంబసభ్యులతో కలిసి హోమం కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో గౌడ సంఘం పెద్దలు శ్రీనివాస్‌గౌడ్, మునుకుంట్ల సుధాకర్‌గౌడ్, కలగోని శ్రీధర్‌గౌడ్, బుర్ర స్వామి, కలగోని అశోక్‌గౌడ్, బుర్ర ముత్యాలుగౌడ్, మునుకుంట్ల నర్సింహగౌడ్, పబ్బు శ్రీనివాస్‌గౌడ్, బుర్ర విజయ్‌కుమార్‌గౌడ్, శివకుమార్‌గౌడ్, దర్శన్‌గౌడ్, రాజుగౌడ్, మహేష్‌గౌడ్, కొండ శివకుమార్‌గౌడ్, పాల్గొన్నారు.

● ఉర్సు సందడి



నల్లగొండ జిల్లా కేంద్రంలో లతీఫుల్లా షాఖాద్రీ ఉర్సులో ఓ వైపు ఆధ్యాత్మిక వెల్లివిరుస్తుండగా, మరోవైపు కొనుగోళ్ల సందడి నెలకొంది. ఇక్కడ ఏర్పాటుచేసిన పలు దుకాణాల్లో ప్రజలు కొనుగోళ్లతో సందడి చేశారు.



మూసీ పునరుజ్జీవ

ప్రాజెక్టు చేపట్టాల్సిందే

» రాజకీయాల కోసం అడ్డుకుంటే ప్రజలు క్షమించరు
» శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

నల్లగొండ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మూసీ ప్రక్షాళన ప్రాజెక్టుపై ప్రతిపక్షాలు దుర్మార్గపూరితంగా వ్యవహరించడం సరికాదని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి హితవు పలికారు. శుక్రవారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మూసీ ప్రాజెక్టు పునరుజ్జీవం ఇప్పటికిప్పుడు చేపట్టిందేమీ కాదని, 1999లో ప్రధానిగా వాజపేయి ఉన్నప్పటి నుంచి కొనసాగుతుందన్నారు. గత బీఆర్ఎస్ హయాంలో కూడా రూ.18వేల కోట్ల మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు కొనసాగిందని గుర్తుచేశారు. ఈ విషయాలన్నింటినీ విస్మరించి ప్రతిపక్షాలు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాత్రమే ఈ ప్రాజెక్టు చేపట్టి దోచుకుంటున్నట్లు ప్రచారం చేయడం సమంజసం కాదన్నారు. మూసీ నది కాలుష్యంతో ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని ఏడు నియోజకవర్గాల ప్రజలు అవస్థలు పడుతున్నారని, ఈ ప్రాంతంలో పండే పంటలు, కూరగాయలను ఇక్కడే విక్రయించుకోలేని, తినలేని దుస్థితిని ఎదుర్కొంటున్నారని వివరించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ప్రభుత్వం మూసీ పునరుజ్జీవంపై కొంత పట్టుదలతో వ్యవహరిస్తున్నందుకు అభినందిస్తున్నానని తెలిపారు. మూసీ ప్రాజెక్టుని ఉద్దేశపూర్వంగా అడ్డుకుంటే ప్రతిపక్షాలపై ఉద్యమించేందుకు నల్లగొండ జిల్లా ప్రజలు సిద్ధంగా ఉండాలని సూచించారు. మునిసిపల్ మాజీ మంత్రి కేటీఆర్ చాలా తెలివిగలవారనడంలో సందేహం లేదని, కానీ ఆయన హయాంలోనే హైదరాబాద్ మహానగరంలో 50 అంతస్థుల భవనాలకు అడ్డగోలుగా అనుమతులు ఇచ్చారని, వాటి నిర్మాణంలో వచ్చే మట్టి, ఇతర వ్యర్థాలు ఎక్కడ పోస్తున్నారో హైడ్రా పరిశీలించాలని సూచించారు. మూసీ సుందరీకరణ ప్రాజెక్టును నందనవనం పేరుతో 1998-99లోనే అప్పటి ఎన్‌డీఏ ప్రభుత్వం చేపట్టిందన్నారు. అందులో భాగంగా హస్తినాపురంలో మూసీ ఆక్రమణదారులకు ఇళ్లు కూడా కేటాయించారని, రూ.350 కోట్లతో నాలుగు ఎస్‌టీపీలను కూడా నిర్మించారని గుర్తు చేశారు. మంచి పని చేస్తున్నప్పుడు ప్రతిపక్షాలు ప్రభుత్వానికి సహకరించాలని, నిర్వాసితులకు పరిహారాలు, పునరావాసం విషయంలో సూచనలుంటే చేయాలే తప్ప పూర్తిగా విమర్శలు చేయడం సరికాదని సూచించారు.





మూసీ మురిసేలా..

(మొదటి పేజీ తరువాయి)

పేర్కొన్నారు. హైదరాబాద్ మహానగర మురుగునీరు, మూసీ నది వెంట ఏర్పాటు చేసిన పారిశ్రామికవాడల నుంచి వచ్చే వ్యర్థరసాయనాలతో మూసీ విషతుల్యంగా మారింది. ఈ నీరు ప్రవహించే ఉమ్మడి నల్లగొండ జిల్లాలో భూములు కాలుష్యపూరితం కాగా, ఇక్కడ పండే పంటల్లో కూడా వాటి అవశేషాలు ఉండటంతోపాటు, ఈ నీటిని తాగిని వారికి ప్రాణాంతక రోగాలు సోకుతున్నాయి. నీటిని తాగిన పశువులు సైతం రోగాల బారిన పడుతున్నాయి. తాజాగా మూసీ ప్రక్షాళన పేరుతో ప్రభుత్వం కార్యాచరణ చేపట్టడంతో మూసీపరివాహకం ఉన్న ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఈసారైనా మూసీకి పట్టిన కాలుష్య పీడ విరగడవుతుందని రైతులు ఆశిస్తున్నారు.

మూసీ ప్రక్షాళన చారిత్రక అవసరం



నార్కట్‌పల్లి: మూసీ ప్రక్షాళన చారిత్రక అవసరం. మూసీ ప్రక్షాళన జరిగితే హైదరాబాద్ మినహాయించి మొత్తంగా లాభపడేది నల్లగొండ జిల్లా ప్రజానీకమే. నిజాం కాలం నాడు జీవధారగా ఉన్న మూసీ నది ఇపుడు విషతుల్యమైంది. గతంలో ఫ్లోరిన్ మహమ్మారిబారిన పడిన నల్లగొండ జిల్లా ప్రజల ఆర్తనాదాలను ఢిల్లీ నడివీధుల్లో గొంతెత్తి అరిచినా ఎవ్వరూ పట్టించుకోలేదు. తదుపరి పాలకులు చేపట్టిన కొన్ని సంస్కరణల ఫలితంగా తాత్కాలిక ఉపశమనం పొందడమే తప్ప పూర్తిగా రూపుమాపలేకపోయాం. ఈ పరిస్థితుల్లో మూసీ నది రూపంలో మరో పెను ప్రమాదం నల్లగొండ జిల్లాను కలవరపాటుకు గురిచేస్తోంది. ఇంటికి కాలినడకన రాకపోకలు సాగించే సమయంలో దాహార్తి తీర్చుకునేందుకు మూసీ నది చెలిమల నీటిని తాగేవారు. కానీ, నేడు ఆ పరిస్థితి లేదు. జిల్లాలో 20 శాతం మాత్రమే కృష్ణా జలాలతో పంటలు సాగవుతుండగా, మిగతా 80శాతం పంటలు మూసీ నీటితోనే సాగవుతున్నాయి. దీంతో మూసీ నీటితో పండించిన పంటలు కొనేపరిస్థితి లేదు...చాపలు తినే పరిస్థితి లేక ప్రజల ఉపాధిపై తీవ్ర ప్రభావం చూపుతోంది. మూసీ నీరు కృష్ణా నదిలో కలిసి ఆ నీటిని సైతం విషతుల్యం చేస్తోంది. మూసీ ప్రక్షాళన జరిగి కృష్ణానీటితో అనుసంధానిస్తే భవిష్యత్‌లో జల అద్భుతాలు సాక్షాత్కారమవుతాయి.

● వేముల వీరేశం, నకిరేకల్ ఎమ్మెల్యే

రోగాలు నయం చేసిన నీరు రోగాల పాల్జేస్తోంది

తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు

మోత్కూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఒక నాడు రోగాలు నయమయ్యేందుకు తాగిన మూసీ నీరు నేడు విషతుల్యమై ఆ నీటితో పండిన పంటలు, అందులో పెరిగిన చేపలు తిన్న ప్రజలు, నీరు తాగిన పశుపక్షాదులు రోగాలబారిన పడుతున్నాయని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ, అనంతగిరి కొండల్లో ప్రారంభమైన మూసీ నీరు స్వచ్ఛమైదన్నారు. ఆ నీటిని ఒకప్పుడు టీబీ రోగం నయం అయ్యేందుకు తాగమనే వారన్నారు. మూసీ పరివాహకం ఆక్రమణలకు గురై అందులోకి మురుగు నీరు, పరిశ్రమల కాలుష్యపు నీరు వదలడం, వ్యర్థాలు వేయడంతో విషతుల్యమైందన్నారు. ఆ నీటితో పంట పండించిన రైతు తన పంటను తానే తినలేని దుస్థితి ఉందన్నారు. మూసీ పరివాహక ప్రాంత గ్రామాల్లో తాగునీరు కూడా విషతుల్యమైందన్నారు. కోట్ల విజయభాస్కర్‌రెడ్డి హయాంలో మూసీ ప్రక్షాళన చేయాలనుకున్నా అది ముందుకు సాగలేదన్నారు. కేసీఆర్ హయాంలో మూసీ ప్రక్షాళనకు ఓ కమిటీ వేసి దానికి చైర్మన్‌ను నియమించి, రూ.వెయ్యికోట్లు కేటాయించినప్పటికీ చిత్తశుద్ధి లేక పనులు చేయలేదని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి మూసీ పునర్జీవానికి కంకణం కట్టుకుని, మూసీ పరివాహక ప్రాంత ప్రజల శ్రేయస్సు కోసం, హైదరాబాద్‌ను మురికికూపం నుంచి కాపాడి సుందర నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రక్షాళన చేపట్టారన్నారు. సీఎం ఆలోచనను లక్షలాది మంది హర్షిస్తున్నారన్నారు. వంద కాదు 200 శాతం మూసీ ప్రక్షాళన అవసరమన్నారు. మూసీ ప్రక్షాళన పూర్తయితే సీఎం రేవంత్‌రెడ్డికి మంచి పేరొచ్చి ప్రజలు ఆయన వెంటే ఉంటారని, ఎన్ని మాయ మాటలు చెప్పినా నమ్మరన్న దుగ్ధతో కేటీఆర్, హరీష్‌రావు, ఈటల తదితరులు ఈ పనులను అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. మూసీ ప్రక్షాళన వద్దనడం వారి అవగాహనారాహిత్యానికి పరాకాష్ట అన్నారు. మూసీ ప్రక్షాళన చేసి, గోదావరి జలాలు మూసీలోకి వదిలితే మూసీ పరివాహక ప్రాంత ప్రజలు ఈ తరం వారే కాదు భావితరాల వారు కూడా సీఎం రేవంత్‌రెడ్డికి రుణపడి ఉంటారన్నారు. మూసీ ప్రక్షాళనకు రాజకీయాలకు అతీతంగా కలిసి రావాలని, ప్రజలు సైతం మద్దతు తెలపాలన్నారు.

రాష్ట్ర స్థాయి కళా ఉత్సవ్ పోటీలకు కోదాడ విద్యార్థులు



రాష్ట్ర స్థాయి కళా ఉత్సవ్‌కు ఎంపికైన విద్యార్థులతో ఎంఈవో సలీంషరీఫ్, ఉపాధ్యాయ బృందం

కోదాడ టౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి కళాఉత్సవ్‌కు సూర్యాపేట జిల్లా కోదాడ ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారు. ఇనుస్ట్రుమెంట్ మ్యూజిక్ విభాగంలో తొమ్మిదవ తరగతికి చెందిన పీ అక్షయ్, విజువల్ ఆర్ట్స్ విభాగంలో తొమ్మిదవ తరగతికి చెందిన ఎస్‌డీ సాధిక్, ట్రెడిషనల్ స్టోరీ టెల్లింగ్ విభాగంలో తొమ్మిదవ తరగతికి చెందిన పీ హరీష్‌కుమార్‌లు జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు కోదాడ ఎంఈవో సలీంషరీఫ్ తెలిపారు. రెండు రోజులుగా సూర్యాపేటలో నిర్వహించిన జిల్లా ఉత్సవ్‌లో విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. నవంబరు 1, 2 తేదీల్లో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో ఈ విద్యార్థులు పాల్గొంటారని ఆయన తెలిపారు. శుక్రవారం ముగ్గురు విద్యార్థులను ఎంఈవో అభినందించి, మాట్లాడారు. విద్యార్థులు పట్టుదలతో కృషి చేస్తే సాధించలేనిది ఏదీ ఉండదన్నారు. విద్యార్థులను అభినందించిన వారిలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు డీ మార్కండేయ, జిల్లా సైన్స్ అధికారి ఎల్ దేవరాజు, ఉపాధ్యాయులు ఉన్నారు.

సౌత్‌జోనల్ షటిల్ బ్యాడ్మింటన్ పోటీలకు కేఆర్ఆర్ విద్యార్థి ఎంపిక



షటిల్ బాడ్మింటన్ పోటీలకు ఎంపికైన విద్యార్థి శ్రవణ్‌కుమార్‌ను అభినందిస్తున్న కేఆర్ఆర్ కళాశాల అధ్యాపక బృందం

కోదాడ టౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : సౌత్ జోనల్ ఇంటర్ యూనివర్సిటీ షటిల్ బ్యాడ్మింటన్ పోటీలకు సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణంలోని కేఆర్ఆర్ కళాశాల బీకాం సెకండీయర్ విద్యార్థి డీ శ్రవణ్‌కుమార్ ఎంపికయ్యారు. ఈ నెల 17వ తేదీన నల్లగొండ జిల్లా కేంద్రం సమీపంలోని మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన పోటీల్లో విజేతగా నిలిచారని కళాశాల ప్రిన్సిపాల్ చందా అప్పారావు శుక్రవారం తెలిపారు. ఈ నెల 24వ తేదీ నుంచి 27వ తేదీ వరకు తమిళనాడు రాష్ట్రం చెన్నై సమీపంలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో జరిగే సౌత్ జోనల్ ఇంటర్ యూనివర్సిటీల్లో పోటీల్లో శ్రావణ్‌కుమార్ పాల్గొంటారని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా శ్రవణ్‌కుమార్‌ను శాలువాలతో సత్కరించి, అభినందించారు. భవిష్యత్‌లో కళాశాల తరుపున అనేక బహుమతులు సాధించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ఫిజికల్ డైరెక్టర్ ఫ్రాన్సిస్, సహాయ చార్యులు సైదిరెడ్డి, నాగిరెడ్డి, శ్రీలత, నిర్మలకుమారి, వీవీరెడ్డి, విద్యార్థులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

క్రైం పాయింట్ (Crime point)

ప్రేమ పేరిట బాలికపై లైంగిక దాడి

భువనగిరి టౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రేమ పేరిట బాలికను లొంగదీసుకుని లైంగిక దాడి చేసిన ఘటన యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రం భువనగిరిలో వెలుగుచూసింది. భువనగిరి పట్టణ ఇన్‌స్పెక్టర్ సురేష్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బీహార్‌కు చెందిన ఓ వలస కుటుంబం పట్టణ శివారులో ఓ దుకాణం నిర్వహిస్తూ జీవనం సాగిస్తోంది. తల్లిదండ్రులతో పాటు దుకాణంలో కూర్చునే వారి కుమార్తె(16)ను ప్రేమిస్తున్నానంటూ భువనగిరి హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన కారు మెకానిక్ ఖాజాఖాన్(22) కొంత కాలంగా వేధిస్తున్నాడు. ఈ క్రమంలో మాయమాటలు చెప్పి ఈ నెల 10వ తేదీన బాలికను ఇంటి నుంచి తీసుకెళ్లాడు. దీంతో ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు నాలుగు రోజుల పాటు వెతికినప్పటికీ ఆచూకీ లభించకపోవడంతో ఈ నెల 14న పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో అదే రోజున పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్న క్రమంలో హైదరాబాద్ కాంచన్‌బాగ్‌లోని ఖాజాఖాన్‌కు వరుసకు సోదరుడైన బురాన్ పాషా ఇంటిలో తలదాచుకున్నట్లు తేలడంతో ఈ నెల 16న అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు నిర్వహించిన విచారణలో మైనర్ బాలికపై పలుమార్లు లైంగిక దాడి జరిగినట్లు రుజువైంది. దీంతో వైద్యచికిత్సల అనంతరం బాలికను సఖి కేంద్రానికి తరలించి ఖాజాఖాన్, బురాన్ పాషాపై అత్యాచారం, పోక్సో కేసులు నమోదు చేసి గురువారం కోర్టులో హాజరు పరిచినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. నిందితులిద్దరికీ కోర్టు రిమాండ్ విధించడంతో నల్లగొండ జిల్లా జైలుకు తరలించారు.

కారు ఢీకొని ఒకరి మృతి, ఇద్దరికి గాయాలు

నార్కట్‌పల్లి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని గోపలాయపల్లి బస్‌స్టేజీ సమీపంలో కారు ఢీకొని ఒకరు మృతి చెందగా, ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ సంఘటన హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై శుక్రవారం జరిగింది. ఎస్‌ఐ క్రాంతికుమార్ తెలిపిన వివరాల ప్రకారం కట్టంగూరు మండలం ఈదులూరులో తమ సమీప బంధువు ఒకరు చనిపోవడంతో పరామర్శించేందుకు చిట్యాల మండలం నేరడ గ్రామానికి చెందిన ముశం రామస్వామి, అన్నపూర్ణ దంపతులతో పాటు ఆమె ఇంటి పక్కనే ఉండే మిర్యాల కౌసల్య (55)అనే మహిళ కలిసి బైక్‌పై బయలుదేరారు. నేరడ నుంచి వయా గాదిరెడ్డిపల్లి మీదుగా వచ్చి గోపలాయపల్లి బస్‌స్టేజీ వద్ద జాతీయ రహదారిపైకి వచ్చే క్రమంలో నార్కట్‌పల్లి నుంచి హైదరాబాద్‌కు వైపునకు అతివేగంగా వెళ్తున్న ఓ కారు ఢీ కొట్టింది. దీంతో ఈ ముగ్గురికి తీవ్రగాయాలు కాగా 108 అంబులెన్స్‌లో నార్కట్‌పల్లిలోని కామినేని ఆసుపత్రికి తరలించారు. వీరిలో కౌసల్య పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందింది. మృతురాలి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. కాగా గాయపడిన అన్నపూర్ణ పరిస్థితి విషమంగా ఉందని సమాచారం.

శ్రీశైలం దర్శనానికి వెళ్లి అదృశ్యం


ఇద్దయ్య

దేవరకొండ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : శ్రీశైలం దర్శనానికి వెళ్లిన నల్లగొండ జిల్లా దేవరకొండ మండలం శేరిపల్లి వద్యతండాకు చెందిన మాడెం ఇద్దయ్య అమ్రాబాద్ అడవుల్లో అదృశ్యమయ్యాడు. తండాకు చెందిన మాడెం పెద్దయ్య, జంగమ్మ దంపతుల కుమారుడు ఇద్దరు ఆరు నెలలుగా భార్యాపిల్లలతో కలిసి హైదరాబాద్‌లో ఉంటున్నాడు. దసరా పండగకు వచ్చిన ఇద్దయ్య ఈ నెల 14న శ్రీశైలం వెళ్తున్నానని బైక్‌పై ఇంటి నుంచి వెళ్లాడు. కాగా నాగర్‌కర్నూల్ జిల్లా మన్ననూరు అటవీ ప్రాంతంలో ఇద్దయ్య బైక్, సెల్‌ఫోన్, బ్యాగు పడి ఉండడాన్ని చూసిన స్థానికులు అక్కడి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకొని సీసీ ఫుటేజీల ఆధారంగా విచారణ చేస్తున్నారు. నాలుగు రోజులు గడుస్తున్నా ఇద్దయ్య ఆచూకీ తెలియరాలేదు. అడవిలో జంతువులు దాడి చేశాయా, ఎవరైనా కిడ్నాప్ చేశారా అనే కోణంలో పోలీసులు అమ్రాబాద్ విచారణ చేస్తున్నట్లు సమాచారం. కాగా ఇద్దయ్య విషయం తెలుసుకున్న దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ ఆయన కుటుంబ సభ్యులతో కలిసి నాగర్‌కర్నూల్ జిల్లాకు వెళ్లి పోలీసులతో మాట్లాడారు. ఇద్దయ్య ఆచూకీ తెలిసేలా చర్యలు చేపట్టాలని పోలీసులను కోరినట్లు తెలిపారు.

జాతీయ పక్షి నెమలి అప్పగింత


నెమలిని అప్పగిస్తున్న ప్రిన్సిపాల్ శోభారాణి

నకిరేకల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా నకిరేకల్ పట్టణంలోని గురుకుల బాలికల కళాశాల ప్రిన్సిపాల్ శోభారాణి శుక్రవారం అటవీ శాఖ అధికారులకు జాతీయపక్షి నెమలిని అప్పగించారు. కళాశాలలో శుక్రవారం గాయపడి ఇబ్బందులు పడుతున్న నెమలిని గుర్తించిన ప్రిన్సిపాల్ అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చి వారికి అప్పజెప్పారు. గాయపడిన నెమలిని చికిత్స అనంతరం అటవీ ప్రాంతంలో విడిచిపెట్టినట్లు అటవీ శాఖ అధికారులు తెలిపారు.

పిడుగుపాటుకు 44 జీవాలు మృతి

● ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఘటన

నేరేడుచర్ల, మాడ్గులపల్లి, గరిడేపల్లి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి నల్లగొండ జిల్లాలో శుక్రవారం పిడుగుపాటుకు వేర్వేరుచోట్ల 44జీవాలు మృతి చెందాయి. అందులో 39 గొర్రెలు, నాలుగు మేకలతో పాటు ఒక గేదె కూడా ఉంది. సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలం బోడల్‌దిన్న గ్రామంలో మల్లెపూల లింగయ్య, యలకాని ఆంజనేయులుకు చెందిన 300గొర్రెలను బోడల్‌దిన్న శ్మశానవాటిక వద్ద మేపుతున్నారు. మధ్యాహ్నం సమయంలో వర్షం పడుతుండడంతో కొన్ని గొర్రెలు శ్మశానవాటికలోని షెడ్‌లోకి, మరికొన్ని చెట్ల కిందకు వెళ్లాయి. ఇంతలోనే మెరుపులు ఉరుములతో ఒక్కసారిగా పిడుగు పడటంతో చెట్ల కింద ఉన్న 39 గొర్రెలు మృతి చెందాయి. వీటివిలువ సుమారు రూ.6లక్షల వరకు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరారు. అదేవిధంగా నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి మండలం అభంగాపురం గ్రామంలో బోయ మల్లయ్యలకు చెందిన మేకలు మేత కోసం గ్రామశివారులోకి వెళ్లాయి. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం రావడంతో పిడుగుపడి నాలుగు మేకలు మృతి చెందాయి. మేకల విలువ రూ.50 వేల వరకు ఉంటుందని బాధితుడు తెలిపారు. మేకలపై ఆధారపడి జీవిస్తున్న తనను ప్రభుత్వం తగిన పరిహారం అందించి ఆదుకోవాలని బాధితుడు మల్లయ్య ప్రభుత్వాన్ని కోరాడు. అదేవిధంగా సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం సోమ్లాతండాలో గ్రామానికి చెందిన ఫుసింగ్ బీచానాయక్ పాడి గేదె పిడుగుపాటుకు గురై మృతి చెందింది. గేదె ధర సుమారు రూ.50 వేలు ఉంటుందని ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరారు.


నేరేడుచర్ల మండలం బోడల్‌దిన్న గ్రామంలో పిడుగుపాటుకు చెల్లాచెదురై మృతి చెందిన మేకలు

పిడుగుపాటుతో దెబ్బతిన్న రేకుల ఇళ్లు

మిర్యాలగూడ అర్బన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని శాంతినగర్ కాలనీకి చెందిన బొల్లా లక్ష్మీనారాయణ ఇంటిపై శుక్రవారం పిడుగుపడింది. దీంతో ఇంటి పైకప్పు సిమెంటు రేకులు ధ్వంసంకాగా, గోడకు పగుళ్లు ఏర్పడ్డాయి. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది. ఇంట్లోని ఎలక్ట్రానిక్ పరికరాలు ధ్వంసమయ్యాయి. అదేవిధంగా కాలనీలోని సుమారు 50 ఇళ్లల్లో టీవీలు, ఫ్రీజర్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు కాలిపోయినట్లు స్థానికులు తెలిపారు. విషయం తెలుసుకున్న కౌన్సిలర్ ఉదయభాస్కర్ బాధితుల ఇళ్లను పరిశీలించి పరామర్శించారు. ప్రకృతి వైపరీత్యంతో జరిగిన నష్టాన్ని అంచనావేసి పరిహారం అందజేసి బాధిత కుటుంబాలను ఆదుకోవాలని ఆయన కోరారు.

విద్యుదాఘాతంతో ఆవు...

నార్కట్‌పల్లి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం మాండ్ర గ్రామంలో విద్యుదాఘాతానికి గురై శుక్రవారం ఆవు మృతి చెందింది. మాండ్ర మాజీ సర్పంచ్ దొండ రమేష్, సౌమ్యలకు చెందిన ఆవు రోజు మాదిరిగానే మేత మేసేందుకు పల్లె ప్రకృతి వనం వద్దకు వెళ్లింది. మేత మేస్తూ పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. ఆవు విలువ సుమారు రూ.45,000లు ఉంటుందని బాధితుడు రమేష్ తెలిపారు.

కుక్కల దాడిలో ఏడు గొర్రెపిల్లలు ..

చౌటుప్పల్ రూరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ మునిసిపాలిటీ పరిధి లక్కారంలో ఊర కుక్కల దాడిలో ఏడు గొర్రెలు మృత్యువాతపడ్డాయి.. గ్రామానికి చెందిన గొర్రెలకాపరి గుండెబోయిన నరసింహ గొర్రెల మందపై శుక్రవారం రాత్రి కుక్కలు దాడి చేశాయి. దాడిలో ఏడు గొర్రె పిల్లలు మృతి చెందడంతో దాదాపు రూ.30 వేల నష్టం వాటిల్లినట్లు బాధితుడు నరసింహ తెలిపారు. ప్రభుత్వం నష్టపరిహారం అందించాలని కోరారు.

హుజూర్‌నగర్‌లో వ్యక్తికి గాయాలు..

హుజూర్‌నగర్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి):విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు.ఈ ఘటన సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ మండలం కరక్కాయలగూడెంలో శుక్రవారం జరిగింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామంలో లైన్‌మన్‌గా పనిచేస్తున్న రాము తన వద్ద అనిల్‌ను అసిస్టెంట్ ఎలక్ట్రిషియన్‌గా పెట్టుకున్నారు. కాగా పనులు చేస్తుండగా అనిల్ విద్యుదాఘాతానికి గురై గాయపడ్డాడు. వెంటనే అతడిని హుజూర్‌నగర్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

దాడి ఘటనలో పలువురి కేసు

ఆత్మకూరు(ఎస్), అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి):సూర్యాపేట జిల్లా ఆత్మకూరు(ఎస్) మండలం కోటినాయక్‌తండాలో గురువారం రాత్రి దాడి ఘటనపై కేసునమోదు చేసినట్లు ఏఎస్‌ఐ రత్నావత్ శంకర్‌నాయక్ తెలిపారు. రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న ధరావత్ సైదాపై అదేగ్రామానికి చెందిన ధరావత్ రాజు, ధరావత్ రాహుల్, బాబోతు రాజేష్‌లు దాడి చేసి గాయపరిచారు. సైదా సూర్యాపేట జనరల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడని, సైదా భార్య జ్యోతి శుక్రవారం ఫిర్యాదుమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మోటార్ల దొంగల అరెస్టు

కనగల్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి) : పంట పొలాల వద్ద విద్యుత్ మోటర్లను చోరీచేస్తున్న దొంగల ముఠాను పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.ఇందుకు సంబంధించి నల్లగొండ జిల్లా కనగల్ ఎస్‌ఐ విష్ణుమూర్తి తెలిపిన వివరాలిలా ఉన్నాయి కనగల్ గ్రామానికి చెందిన కొంతమంది ముఠాగా ఏర్పడి వ్యవసాయ భూముల వద్ద రైతు సంచారం లేని సమయంలో ఆటోలో సంచరిస్తూ కొద్దికాలంగా విద్యుత్ మోటార్లను చోరీ చేస్తున్నారు. దొంగలించిన మోటార్లను విక్రయించేందుకు ఆటోలో నల్లగొండకు తరలిస్తుండగా శుక్రవారం ఉదయం కనగల్ ఎక్స్‌రోడ్డులో పోలీసులకు పట్టుబడ్డారు. ఆటోను స్టేషన్‌కు తరలించి విచారణ చేపట్టగా మోటార్ల దొంగతనం బయటికివచ్చింది. అనంతరం పీ రాంబాబు, కె.నగేష్, రఫీలపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ వివరించారు. ఆటోలని ఏడు మోటార్లను వాటిని తరలిస్తున్న ఆటోను సీజ్ చేసినట్టు ఎస్‌ఐ విష్ణుమూర్తి తెలిపారు.

వేర్వేరుచోట్ల 95 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

పాలకవీడు, మేళ్లచెర్వు, మిర్యాలగూడ అర్బన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని నల్లగొండ, సూర్యాపేట జిల్లాలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మొత్తం 95 క్వింటాళ్ల బియ్యాన్ని పట్టుకుని బాధ్యులపై కేసులు నమోదు చేశారు.


పాలకవీడులో రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా పట్టుకున్న ట్రాక్టర్లతో పోలీసులు

● సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలంలో అక్రమంగా తరలిస్తున్న 60 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్‌ఐ లక్ష్మీనర్సయ్య తెలిపారు. శుక్రవారం తెల్లవారుజామున మండలంలోని పలుగ్రామాల్లో రేషన్‌బియ్యాన్ని సేకరించి రెండు ట్రాక్టర్లలో 60 క్వింటాళ్ల బియ్యాన్ని ఇతర ప్రాంతాలకు తరలిస్తుండగా గుడుగుంట్లపాలెం శివారులో స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. గరిడేపల్లి మండలకేంద్రానికి చెందిన ట్రాక్టర్ల డ్రైవర్లు సత్యనారాయణ, శ్రీనులపై కేసు నమోదు చేసి విచరణ చేపడుతునట్లు తెలిపారు.

● సూర్యాపేట జిల్లా చింతలపాలెం మండలంలోని గుడిమల్కాపురం గ్రామంలో తరలించేందుకు సిద్ధంగా ఉన్న 30 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ అంతిరెడ్డి తెలిపారు. గుడిమల్కాపురం గ్రామానికి చెందిన పులి గోపి ఇంటి వద్ద అక్రమంగా నిల్వచేసిన రేషన్ బియ్యాన్ని జగ్గయ్యపేటకు చెందిన కాశీం ఆటోలో తరలించడానికి సిద్ధంగా ఉండగా సిబ్బందితో దాడి చేసి పట్టుకున్నామన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

● నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో అక్రమంగా తరలిస్తున్న రేషన్‌బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. టూటౌన్ సీఐ నాగార్జున తెలిపిన వివరాల ప్రకారం స్థానిక శాంతినగర్ కాలనీకి చెందిన కిరాణ దుకాణ నిర్వాహకుడు చెరుపల్లి సైదులు సేకరించిన రేషన్ బియ్యాన్ని ఇతర ప్రాంతానికి తరలించేందుకు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం వచ్చిందన్నారు. దీంతో అక్కడకు చేరుకొని పరిశీలించగా ఎనిమిది బస్తాల్లో నింపిన రేషన్ బియ్యాన్ని ఆటోలోకి ఎత్తుతుండగా పట్టుకుని సివిల్‌సప్లయ్ అధికారులకు సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. రేషన్ బియ్యం లోడ్‌తో ఉన్న ఆటోను సీజ్‌చేసి సైదులుపై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నాగర్జున తెలిపారు.

ఉన్నతాధికారులు మానసికంగా వేధిస్తున్నారు

- ఎన్నెస్పీ ఈఈ కార్యాలయం ఎదుట ఉద్యోగి నిరసన
- ప్రొఫెషన్ డిక్లరేషన్ ఇవ్వడం లేదంటూ ఆందోళన
- ఈఈ, డీఈలపై పలు ఆరోపణలు
- నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో ఘటన


మిర్యాలగూడ పట్టణంలోని ఎన్నెస్పీ ఈఈ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న జూనియర్ అసిస్టెంట్ పావని

మిర్యాలగూడ అర్బన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఎన్నెస్పీ కార్యాలయంలో తనకు సంబంధంలేని సెక్షన్ల పనులు అప్పగించి వాటిని చక్కబెట్టాలంటూ ఉన్నతాధికారులు మానసికంగా వేధిస్తున్నారని ఓ మహిళా ఉద్యోగి నిరసనకు దిగింది. శుక్రవారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయం ఎదుట ఈ సంఘటన జరిగింది. ఉద్యోగి పావని తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మిర్యాలగూడ నీటి పారుదల శాఖ ఈఈ కార్యాలయంలో పావని మూడున్నరేళ్లుగా జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తోంది. కార్యాలయంలో పనిచేస్తున్న ఇద్దరు సీనియర్ అసిస్టెంట్ల నుంచి ముడుపులు స్వీకరించి మరొక సెక్షన్‌లో పోస్టింగ్ సృష్టించి విధుల్లోకి తీసుకున్నట్లు ఆరోపించారు. సదరు సీనియర్ అసిస్టెంట్లు, కొందరు ఏఈల బాధ్యతలను తనకు అదనంగా అప్పగించి సకాలంలో పూర్తి చేయాలని ఈఈ మానసికంగా వేధిస్తున్నట్లు వాపోయింది. తనకు సంబంధం లేని విధులను నిర్వహించలేనని తెగేసి చెప్పడంతో తనపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించింది. అయితే ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అప్పగించిన బాధ్యతలు నిర్వహించడం లేదన్న కారణంతో డీఈ సైతం తనపై కక్షగట్టి మూడు నెలల్లో 15 మెమోలు ఇచ్చినట్లు ఆవేదన వ్యక్తం చేసింది. ఉన్నతాధికారుల కర్ర పెత్తనాన్ని నిలదీస్తే ఎస్ఈ కార్యాలయానికి సరెండర్ చేస్తామంటూ ఉన్నతాధికారులు బెదిరిస్తున్నట్లు ఆరోపించింది. కార్యాలయంలో సెక్షన్లు మార్చడమే కాకుండా తన ప్రొఫెషన్ డిక్లరేషన్ చేయకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు వాపోయింది. దీంతో తనకు 6 నెలలుగా రావాల్సిన సర్వీస్ ఇంక్రిమెంట్లు నిలిపివేశారంటూ ఆవేదన వ్యక్తం చేసింది. తనను ఇబ్బందులకు గురిచేస్తున్న విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపింది. ఉన్నతాధికారులు స్పందించి తనకు న్యాయం చేయాలని, ఆరు నెలలుగా మానసికంగా వేదింపులకు గురిచేస్తున్న ఈఈ, డీఈలను సస్పెండ్ చేయాలని బాధిత ఉద్యోగిని పావని డిమాండ్ చేసింది. సాయంత్రం 4 గంటల నుంచి గంట సేపు ఆందోళన చేసిన అనంతరం వివరాలన విలేకరులకు తెలిపింది. ఆందోళన చేసే సమయంలో ఈఈ, డీఈలు కార్యాలయంలో లేరు. ఈ విషయమై ఈఈ లక్ష్మణ్, డీఈ వెంకటరమణలను వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఫోన్‌కు సమాధానమివ్వలేదు.

ప్రాణాలు కాపాడిన డయల్-100 కాల్

● మద్యం మత్తులో ఆత్మహత్యాయత్నం

భువనగిరి టౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో మెడకు వైరును చుట్టుకుని ఓ వ్యక్తి ఆత్యహత్యకు యత్నించాడు. కానీ ఆ క్రమంలో 100 డయల్‌కు చేసిన ఫోన్ కాల్ అతని ప్రాణాలను కాపాడింది. గురువారం యాదాద్రిభువనగిరి జిల్లాలో ఈ ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భువనగిరి తారకరామనగర్‌కు చెందిన బ్రహ్మచారి వడ్రంగి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతను మద్యానికి బానిసై కొంతకాలంగా పనులను మానివేశాడు. ఈ క్రమంలో గురువారం మద్యం మత్తులో ఇంటికి వచ్చి లోపల నుంచి తలుపులు మూసుకుని గదిలోని టేబుల్‌కు కట్టిన వైర్‌ను మెడకు చుట్టుకుని ఆత్మహత్యకు ప్రయత్నించాడు. ఈ క్రమంలోనే 100 డయల్‌కు అతనే ఫోన్ చేసి ఆత్మహత్య చేసుకుంటున్నట్టు సమాచారం ఇచ్చాడు. వెంటనే ఆ ప్రాంతంలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న కానిస్టేబుల్ ప్రసాద్‌రెడ్డి సెల్‌ఫోన్‌కు యాప్ ద్వారా 100 డయల్ సమాచారం వచ్చింది. దీంతో ప్రసాద్‌రెడ్డి బృందం బ్రహ్మచారి ఇంటికి వెళ్లగా వెలుపల అతని భార్య, చుట్టుపక్కల వాళ్లు కూర్చుని ఉన్నారు. బ్రహ్మచారి ఎక్కడని పోలీసులు అడగగా లోపల నిద్రిస్తున్నాడని చెప్పారు. పోలీసులు తలుపులను బాదినప్పటికీ తెరవకపోవడంతో తలుపులను ధ్వంసంచేసి లోనికి వెళ్లగా, అప్పటికే బ్రహ్మచారి అపస్మారక స్థితికి వెళ్లాడు. అప్రమత్తమైన కానిస్టేబుల్ వెంటనే సీపీఆర్ చేసి అంబులెన్స్ ద్వారా జిల్లా ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం బ్రహ్మచారి ఆస్పత్రిలో కోలుకుంటున్నాడు. ఫోన్ కాల్ వెళ్లిన వెంటనే 100 డయల్, స్థానిక పోలీసులు సకాలంలో స్పందించి బ్రహ్మచారి ప్రాణాలను కాపాడారని కానిస్టేబుల్ ప్రసాద్‌రెడ్డిని పట్టణ ఇన్‌స్పెక్టర్ కే.సురేష్‌కుమార్ ప్రశంసించారు.


సీపీఆర్ చేస్తున్న కానిస్టేబుల్ ప్రసాద్‌రెడ్డి

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదలపై హామీ

● సమ్మె విరమించిన ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్యాలు

భువనగిరి టౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల చెల్లింపుపై ప్రభుత్వం నుంచి లభించిన హామీతో ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల యాజమన్యాలు కళాశాలల బంద్‌ను విరమించుకున్నారు. శుక్రవారం హైదరాబాద్‌లో డిప్యూటీ సీఎం మల్లు బట్టు విక్రమార్కతో తెలంగాణ ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్యాల అసోసియేషన్ (టీపీడీపీఎంఏ) ప్రతినిధులు జరిపిన చర్చలు విజయవంతం అయ్యాయి. దీంతో ఉమ్మడి జిల్లాలోని 60 ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల నాలుగు రోజుల అనంతరం శుక్రవారం తెరుచుకున్నాయి. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలతో ఉపముఖ్యమంత్రి బట్టివిక్రమార్క, ప్రిన్సిపల్ సెక్రటరీ డాక్టర్ బుర్ర వెంకటేశం తదితర అధికారులు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య, టీపీడీఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బొజ్జ సూర్యనారాయణరెడ్డితో కూడిన బృందంతో జరిపిన చర్చల్లో సుమారు రూ. 6వేలకోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయడానికి ప్రభుత్వం సానుకూలత చూపింది. దీంతో కళాశాలల బంద్‌ను విరమించుకుంటున్నట్టు టీపీడీపీఎంఏ ప్రకటించింది. పలు అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లినట్టు యాజమన్యాలు అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. ప్రభుత్వ నిర్ణయంతో ఉమ్మడి జిల్లాలోని 60 ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలలకు రావల్సిన సుమారు రూ. 120 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ రానున్నది. కాగా బంద్ కారణంగా ఉమ్మడి జిల్లాలోని 60 కళాశాలలకు గత నాలుగు రోజులుగా దూరంగా ఉన్న 30వేల మంది విద్యార్థులు, బోధన, బోధనేతర సిబ్బంది శుక్రవారం కళాశాలలకు హాజరు అయ్యారు. బంద్‌తో నష్టపోయిన సిలబస్‌ను పూర్తి చేస్తామని, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదలకు హామీ ఇచ్చిన ప్రభుత్వానికి టీపీడీఎంఏ ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు.


డిప్యూటీ సీఎం మల్లు బట్టి విక్రమార్కకు వినతిపత్రం అందజేస్తున్న టీపీడీపీఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సూర్యనారాయణరెడ్డి, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు కృష్ణయ్య తదితరులు

సాగర్ సమాచారం

పూర్తిస్థాయి నీటి మట్టం	590.00 అడుగులు
టీఎంసీలు	312.0450
ప్రస్తుత నీటి మట్టం	589.90
టీఎంసీలు	311.7482
ఎడమకాల్వకు నీటి విడుదల	6,173
కుడికాల్వకు	3,371
విద్యుత్ కేంద్రం ద్వారా	29,556
సాగర్‌కు నీటి రాక	67,717
ఎస్‌ఎల్‌బీసీ ద్వారా	1,800 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	89,840 క్యూసెక్కులు

- నాగార్జునసాగర్, (ఆంధ్రజ్యోతి)

పులిచింతల ప్రాజెక్టు

పూర్తిస్థాయి నీటి నిల్వ	45.77 టీఎంసీలు
ప్రస్తుత నీటి నిల్వ	44.38 టీఎంసీలు
పులిచింతలకు నీటి రాక	65,926
నీటి విడుదల	64,312

- మేళ్లచెర్వు,(ఆంధ్రజ్యోతి)

మూసీ నీటిమట్టం

పూర్తిస్థాయి నీటి మట్టం	645 అడుగులు
టీఎంసీలు	4.46
ప్రస్తుత నీటి మట్టం	644.33 అడుగులు
టీఎంసీలు	4.29
ఇన్‌ఫ్లో	1582.62 క్యూసెక్కులు
ఔట్‌ఫ్లో	1436.45 క్యూసెక్కులు

- కేతేపల్లి,(ఆంధ్రజ్యోతి)

శాలిగౌరారం

పూర్తి స్థాయి నీటిమట్టం	21 అడుగులు
ప్రస్తుత నీటిమట్టం	19 అడుగులు

- శాలిగౌరారం,(ఆంధ్రజ్యోతి)

డిండి

పూర్తి స్థాయి నీటిమట్టం	36 అడుగులు
టీఎంసీలు	2.4
ప్రస్తుత నీటిమట్టం	36 అడుగులు
ఇన్‌ఫ్లో	3750 క్యూసెక్కులు
ఔట్‌ఫ్లో	3750 క్యూసెక్కులు


-డిండి,(ఆంధ్రజ్యోతి)


అమ్మవారికి హారతి ఇస్తున్న అర్చకులు

ఆండాళ్ అమ్మవారికి ఊంజల్ సేవోత్సవం

భువనగిరి అర్బన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి వారి సన్నిధిలో శుక్రవారం స్వామివారికి సువర్ణపుష్పార్చన, అమ్మవారికి ఊంజల్ సేవోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆగమశాస్త్ర రీతిలో వేడుకలు నిర్వహించిన అర్చకులు వేకువజామున సుప్రభాత సేవతో స్వయంభువులను మేల్కొలిపి పంచామృతాలు, వేద మంత్ర పఠనాలతో అభిషేకం, తులసీదళాలు, కుంకుమతో అర్చించారు. ప్రాకారమండపంలో హోమం, నిత్యకల్యాణోత్సవం సంప్రదాయరీతిలో కొనసాగాయి. సాయంత్రం ప్రధానాలయంలో కొలువుదీరిన ఆండాళ్ అమ్మవారిని పట్టువస్త్రాలు, ముత్యాలు, బంగారు ఆభరణాలతో దివ్యమనోహరంగా అలంకరించి సేవలో తీర్చిదిద్దారు. అమ్మవారి సేవను ఆలయ తీరు వీధుల్లో ఊరేగించిన అర్చకులు ప్రాకార మండపంలో అద్దాల మండపం ఊయలలో అధిష్ఠింపజేశారు. అర్చకుల వేదమంత్ర పఠనాలు, ఆస్థాన విద్వాంసుల మంగళవాయిద్యాలు, మహిళ భక్తుల మంగళనీరాజనాల నడుమ ఊంజల్ సేవోత్సవం నేత్రపర్వంగా కొనసాగింది. పాతగుట్ట ఆలయంలో నిత్య పూజలు సంప్రదాయరీతిలో కొనసాగాయి. శివాలయంలో శ్రీ పర్వతవర్ధిని రామలింగేశ్వర స్వామికి నిత్యపూజలు, యాగశాలలో చండీ హోమం శైవాగమన పద్ధతిలో చేపట్టారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల నుంచి రూ.12,65,043 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో భాస్కర్‌రావు తెలిపారు. కాగా, సంగీత సభల్లో భాగంగా హన్మకొండకు చెందిన హంపీ నాట్యకళా నిలయం జయశ్రీ, అర్చన నృత్యనికేతన్ అర్చన కూచిపూడి నృత్య ప్రదర్శనలు భక్తులను అలరించాయి.

నేడు రామన్నపేటలో సబ్‌కోర్టు ప్రారంభం


నూతన సబ్‌కోర్టు భవనం

రామన్నపేట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా రామన్నపేట మండల కేంద్రంలో సబ్‌కోర్టు శనివారం ప్రారంభం కానుంది. హైకోర్టు పోర్ట్‌పోలియో న్యాయమూర్తి జవ్వాజి శ్రీదేవి, హైకోర్టు న్యాయమూర్తి కూనూరు లక్ష్మణ్ నూతన కోర్టును ప్రారంభించనున్నారు. ప్రస్తుతం రామన్నపేటలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులు ఉన్నాయి. కొత్తగా ఏర్పాటుచేసే సబ్‌కోర్టు పరిధిలోకి రామన్నపేట, పోచంపల్లి, మోత్కూరు, చౌటుప్పల్, అడ్డగూడూరు, వలిగొండ, సంస్థాన్‌నారాయణపురం మండలాలు రానున్నాయి. ఈ కోర్టులో పదేళ్లగా శిక్షలు పడే అవకాశం ఉన్న కేసులు, విడాకులు రూ.50లక్షల్లోపు విలువ గల సివిల్ కేసులను పరిష్కరిస్తారు. రామన్నపేటకు సబ్‌కోర్టు మంజూరుపై ప్రజలు,న్యాయవాదులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

● ఎమ్మెల్యే వేముల వీరేశం

● ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభం

నార్కట్‌పల్లి, చిట్యాలరూరల్, అక్టోబరు18 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. నార్కట్‌పల్లి, ఎల్లారెడ్డిగూడెం గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. రుణమాఫీ చేయకుండా గత ప్రభుత్వం రైతులను మోసం చేస్తే రూ.2లక్షల రుణమాఫీ చేసి తమ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన మాట నిలబెట్టుకుందని పునరుద్ఘాటించారు. రైతులతో పాటు అన్ని వర్గాల సంక్షేమానికి సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని అన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ ఛైర్మన్ రేగట్టె నారాయణరెడ్డి, వైస్‌ఛైర్మన్ శంకరయ్య, కాంగ్రెస్ నాయకులు సట్టు సత్తయ్య, సిద్దగోని స్వామిగౌడ్, దొండ రమేష్, బింగి కొండయ్య, బింగి మహేష్, దాసరి రాజు, నూకల శంకర్, గడ్డం పశుపతి, నల్ల వెంకన్న, మేకల వెంకన్న, నర్సిరెడ్డి, పుల్లెంల అచ్చాలు, భరత్, కృష్ణ, బిక్షపతి, సమ్మద్, తహసీల్దార్ వెంకటేశ్వర్‌రావు, సుధాకర్ పాల్గొన్నారు.

● కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే రైతుల ప్రభుత్వమని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. చిట్యాల మండలం గుండ్రాంపల్లిలో పీఏసీఎస్ ఆ ధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని డెయిరీ డెవలప్‌మెంట్ ఛైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి, డీసీసీబీ వైస్‌ఛైర్మన్ ఏసిరెడ్డి దయాకర్‌రెడ్డి తో కలిసి ఆయన ప్రారంభించారు. రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలకు నాణ్యమైన ధాన్యాన్ని తీసుకువచ్చి మద్దతు ధర పొందాలని సూచించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ పాలకవర్గ సభ్యులు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.



శెట్టిపాలెం మిల్లుల వద్ద ధాన్యాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడుతున్న డీఎస్‌వో వెంకటేశ్వర్‌రావు

రూ.2400 తగ్గకుండా ఇవ్వాలి : డీఎస్వో

వేములపల్లి: మిల్లర్లు రైతులు తీసుకొచ్చిన ధాన్యాన్ని క్వింటాకు రూ.2400కు తగ్గకుండా ధర చెల్లించాలని డీఎస్‌వో వెంకటేశ్వర్‌రావు ఆదేశించారు. శుక్రవారం మండలంలోని శెట్టిపాలెం గ్రామ శివారులోగల మహాతేజ, లక్ష్మీ రైస్ ఇండస్ట్రీస్‌లో ధాన్యం కొనుగోళ్లను ఆయన పరిశీలించి మాట్లాడారు. మిల్లర్లు రైతులను ఇబ్బందులకు గురి చేయకుండా వర్షాభావ పరిస్థితులను అడ్డుగా పెట్టుకొని తక్కువ ధర చెల్లిస్తే చట్టపరంగా తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలో ధాన్యం కొనుగోళ్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షించనున్నట్లు తెలిపారు. జిల్లాలో ఇప్పటికే 325 ధాన్యం కొనుగోలు కేంద్రాలను గుర్తించామని, ఇప్పటికే 185 కేంద్రాలను ప్రారంభించగా శుక్రవారం మరో 50 కేంద్రాలను ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు 7వేల క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లుత తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లను చేశామని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ముందస్తుగా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. రైతులు తమకు ఏమైనా ఇబ్బందులు తలెత్తితే జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నెంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ కోటేశ్వరి, ఎంపీడీవో శారదాదేవి, మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కర్నాటి రమేష్, అధ్యక్షుడు గౌరు శ్రీనివాస్, మిల్లర్లు బండారు కుశలయ్య తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభం

అడవిదేవులపల్లి: మండలంలోని ఉల్సాయిపాలెం, మొల్కచర్ల గ్రా మాల్లో శుక్రవారం తహసీల్దార్ జి.సురేష్ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ధాన్యాన్ని దళారులకు అమ్మి మోసపోకుండా కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధరతోపాటు రూ.500 బోనస్ పొందాలన్నారు. కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ శ్యాంసుందర్, సీసీ విజయకుమారి పాల్గొన్నారు.

● కనగల్ మండలంలోని పొనుగోడు, రాంచంద్రాపురం, బోయినపల్లి, బచ్చన్నగూడెం, మదనాపురం, తేలకంటిగూడెం, చర్లగౌరారం, తిమ్మన్నగూడెం, ఎస్‌లింగోటం, చెట్లచెన్నారం, ఎంగౌరారం, తుర్కపల్లి గ్రామాల్లో ఐకేపీ ధాన్యం కేంద్రాలను అధికారులు ప్రారంభించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ పద్మ మాట్లాడుతూ ఐకేపీ నిర్వాహకులు సీరియల్ పాటించి పారదర్శకంగా ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీఎం హరి, సీసీలు వసంత, ప్రభాకర్, విజయ, నర్సింహ, ఎస్‌ఆర్‌పీ జానకి, కార్యదర్శులు, నాయకులు, సంఘబంధం సభ్యులు పాల్గొన్నారు.



నార్కట్‌పల్లి మండలంలోని ఏపీలింగోటంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీరేశం

ట్రాన్స్‌కో ఏఈ బదిలీ

కేతేపల్లి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): కేతేపల్లి మండల ట్రాన్స్‌కో ఏఈ గాబ్రియల్ బదిలీ అయ్యారు. నాలుగేళ్లకు పైగా ఇక్కడ ఏఈగా బాధ్యతలు నిర్వహిస్తున్న గాబ్రియల్‌ను ట్రాన్స్‌కో అధికారులు హైదరాబాద్‌లోని సీబీడీకి బదిలీ చేశారు. ఆయన స్థానంలో ఏఈని నియమించినా ఆయన అనారోగ్య కారణాలతో విధుల్లో చేరకపోవడంతో సబ్ ఇంజనీర్ శ్రీకాంత్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఇక్కడ నియమితులైన రెగ్యులర్ ఏఈ మరో వారం రోజుల్లో విధుల్లో చేరనున్నట్లు తెలిసింది.

డిండి ఏవోగా రెహానా



రెహానా

డిండి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): డిండి మండల వ్యవసాయ శాఖ అధికారిగా రెహానా శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఏవోగా పనిచేస్తున్న నాగేశ్వర్‌రావు బదిలీపై సూర్యాపేట జిల్లాకు వెళ్లారు. కొద్ది రోజులుగా విత్తనోత్పత్తి క్షేత్ర ఏవో రామలింగేశ్వరరావు మండల వ్యవసాయశాఖ అధికారిగా అదనపు బాధ్యతలు నిర్వర్తించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు అందుబాటులో ఉంటూ క్షేత్రస్థాయిలో రైతులు సాగు చేసిన పంట పొలాలను పరిశీలించి తగిన సూచనలు, సలహాలు చేస్తానని తెలిపారు.

విద్యార్థుల సమస్యలపై ఎస్‌ఎఫ్‌ఐ పోరాటం

దేవరకొండ, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ఎస్‌ఎఫ్‌ఐ నిరంతరం పోరాటాలు నిర్వహిస్తుందని ఎస్‌ఎఫ్‌ఐ దేవరకొండ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు రమావత్ లక్ష్మణ్‌నాయక్, బుడిగె వెంకటేష్ అన్నారు. దేవరకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. విద్యాసంస్థలు అద్దె భవనాల్లో నడుస్తున్నాయని, ప్రభుత్వం భవన యజమానులకు బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం అద్దె భవనాల యజమానులకు అద్దె చెల్లించి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. సమావేశంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు చరణ్, ఇద్దిరాములు, రాకేష్, సరస్వతి, రాధిక తదితరులు పాల్గొన్నారు.

నకిలీ మందులు విక్రయిస్తే కఠినచర్యలు



పురుగుల మందు షాపును తనిఖీ చేస్తున్న ఏవో అమరేందర్‌గౌడ్

కనగల్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): రైతులకు నకిలీ పురుగు మందులను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఏవో అమరేందర్ గౌడ్ హెచ్చరించారు. శుక్రవారం కనగల్‌లోని ఎరువుల దుకాణాలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మందుల రిజిస్టర్లు, నిల్వలను పరిశీలించారు. నాణ్యత గల మందులను విక్రయించాలని, రైతులకు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనలను పాటించని దుకాణదారులపై చట్టపరమైన చర్య లు తీసుకుంటామని హెచ్చరించారు.

● అడవిదేవులపల్లి: రైతులకు నకిలీ పురుగుమందులను విక్రయిస్తే చర్యలు తప్పవని ఏవో జి.సరిత హెచ్చరించారు. మండలంలోని ఫర్టిలైజ ర్ దుకాణాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేసి పురుగుమందులను, రికార్డులను పరిశీలించారు. ఆమెవెంట ఏఈవోలు ఉన్నారు.

● చింతపల్లి: మండలంలోని పలు ఎరువుల దుకాణాల్లో ఏవో శ్రావణకుమారి తనిఖీలు నిర్వహించారు. ఎరువులపై ఐఎస్‌ఐ మార్కు లేకుండా, ప్రభుత్వ సంస్థ గుర్తింపు లేని వాటిని విక్రయిస్తే వారిపై పీడీ యాక్టు కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఆమె వెంట ఏఈవో శ్రీలత ఉన్నారు.

అర్హులకు సంక్షేమ పథకాలు అందించాలి

● ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

దామరచర్ల, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): అర్హులకు సంక్షేమ పథకాలను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ప్రజా పాలనలో సేకరించిన ఫిర్యాదులపై అధికారులతో జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. అర్హత కలిగిన వారికి పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రజాపాలనలో సేకరించిన ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించేలా అధికారులు దృష్టి పెట్టాలని సూచించారు. అనంతరం పలువురి నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జవహర్‌లాల్, ఎంపీడీవో మూర్తి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

● మండలంలో నెలకొన్న పెండింగ్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ సీపీఎం మండల కార్యదర్శి మాలోతు వినోద్‌నాయక్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ భూములు సర్వే నిర్వహించి అర్హులైన వారికి పాసు పుస్తకాలు అందించాలని, ఇళ్ల స్థలాల కేటాయింపుతో పాటు మండలంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పాపానాయక్, దయానంద్ పాల్గొన్నారు.

వ్యవసాయ రంగాన్ని పరిశ్రమగా గుర్తించాలి

మిర్యాలగూడ, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి) వ్యవసాయ రంగాన్ని పరిశ్రమగా గుర్తించాలని భారతీయ కిసాన్ సంఘ్ మండల అధ్యక్షుడు కొణతం లింగారెడ్డి కోరారు. ఈ మేరకు 'గ్రామమా నీ పయనమెటు' అనే కార్యక్రమానికి అనుమతి కోరుతూ శుక్రవారం సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, డీఎస్పీ రాజశేఖరరాజులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల భూమిని నిస్సారం చేస్తున్న రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించాలని రైతులకు అవగాహన కల్పించడం, ఎంఎస్ స్వామినాథన్ కమిషన్ సూచన మేరకు పెట్టుబడి ఖర్చులో 50 శాతం అదనంగా కలిపి రైతుల ఉత్పత్తులకు ధర నిర్ణయించాలని డిమాండ్ చేశారు. ఆయా డిమాండ్లతో మండలంలో నవంబరు 1 నుంచి డిసెంబరు చివరి వరకు గ్రామాల్లో ఉదయం 9 నుంచి 12 గంటల వరకు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ మేరకు తమకు అనుమతి ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో కిసాన్‌సంఘ్ నాయకులు పశ్యా వెంకట్‌రెడ్డి, చింతకుంట్ల శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ డీఏలను వెంటనే ప్రకటించాలి

నల్లగొండ అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): పెండింగ్ డీఏలను వెంటనే ప్రకటించాలని టీఆర్‌టీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారెడ్డి అంజిరెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం సచివాలయంలోని సీఎం కార్యాలయం టీజీఈజేఏసీ ఆధ్వర్యంలో ఆయన ముఖ్య కార్యదర్శి శేషాద్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని అన్నారు.

విద్యుత్ ఏఈ గా బాలునాయక్



బాలు నాయక్

త్రిపురారం అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): త్రిపురారం మండల విద్యుత్ శాఖ ఏఈగా ఆ జోవత్ బాలునాయక్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన అనుముల మండలం నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న రవీందర్‌రెడ్డి మిర్యాలగూడెం పట్టణానికి బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా ఏఈ బాలునాయక్ మాట్లాడుతూ మండలంలో ఎలాంటి విద్యుత్ సమస్యలు రాకుండా ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరించనున్నట్లు తెలిపారు. అనంతరం ఎస్టీ యూనియన్ అధ్యక్షుడు, కార్యదర్శులు శాలువాలతో సత్కరించారు.

కమిటీలతో పేదలకు న్యాయం జరగదు : రేగట్టె

నార్కట్‌పల్లి, అక్టోబరు 18, (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో వేస్తున్న ఇందిరమ్మ కమిటీలతో పేదలకు న్యాయం జరగదని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి విమర్శించారు. ఇందిరమ్మ కమిటీ కాంగ్రెస్ పార్టీ నాయకులతోనే వేస్తున్నారని విమర్శించారు. వీటిని ఇందిరమ్మ కమిటీల కన్నా కాంగ్రెస్ కమిటీలని అంటే సరిపోతుందని ఎద్దేవా చేశారు. ఇళ్ల ఎంపిక ఈ కమిటీలతో కేవలం కాంగ్రెస్ పార్టీ వారికే లబ్ధి చేకూరుతుందే తప్ప పేదల ప్రజలకు న్యాయం జరగదన్నారు.

ఈడబ్ల్యూఎస్‌తో బలహీన వర్గాలకు అన్యాయం

నల్లగొండ టౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం డీఎస్సీ ద్వారా ఇటీవల చేపట్టిన ఉపాధ్యాయ నియామకాల్లో ఈడబ్ల్యూఎస్ కోటా కింద ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు అన్యాయం జరిగిందని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి (వీవీపీఎస్) జిల్లా ఛైర్మన్ లకుమల్ల మధుబాబు అన్నారు. మాల మహానాడు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమని పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణ ఆలోచనను వెనక్కితీసుకునే వరకు పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈడబ్ల్యూఎస్ ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు అన్యాయం జరుగుతుంటే మాట్లాడాల్సిన నాయకులు మౌనంగా ఉంటున్నారని పేర్కొన్నారు. అనంతరం వీవీపీఎస్ నియోజకవర్గ కన్వీనర్‌గా రొయ్యకిరణ్, కోకన్వీనర్‌గా అన్నిమల్ల లింగస్వామి, నల్లగొండ మండల కన్వీనర్‌గా బోగరి రామకృష్ణ, పట్టణ కన్వీనర్‌గా ఎన్నమల్ల మహేష్‌బాబు, వివిధ మండలాల బాధ్యులను ఎనుకున్నారు. సమావేశంలో వీవీపీఎస్ జిల్లా కోఛైర్మన్లు అద్దంకి రవీందర్, చింతపల్లి బాలకృష్ణ, సంద యాదగిరి, నామ చక్రవర్తి, అంగరాజు స్వర్ణలత, పేయ్యల గీత, నాయకులు ఎన్నమల్ల అనిల్, అన్నిమల్ల ప్రసాద్, బిక్షం, పృథ్వీ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ సాహితీ దశాబ్ది ఉత్సవాలను జయప్రదం చేయాలి

నల్లగొండ టౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాహితీ సంస్థ ఏర్పడి పదేళ్ల పూర్తవుతున్న సందర్భంగా నిర్వహించనున్న దశాబ్ది ఉత్సవాలను జయప్రదం చేయాలని తెలంగాణ సాహితి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కుకుడాల గోవర్దన్ పిలుపునిచ్చారు. అందులో భాగంగా ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కళాశాలల విద్యార్థులకు కవితల పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. శుక్రవారం కవితల పోటీలకు సంబంధించిన కరపత్రాలను ఎంజీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ అల్వాల రవి, తెలుగుశాఖ విభాగాధిపతి, ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ అరుణప్రియ, ఎన్‌జీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సముద్రాల ఉపేందర్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసక్తి కలిగి విద్యార్థులు తమ కవితలను ఈ నెల 25వ తేదీలోగా వాట్సప్, మెయిల్‌ద్వారా గాని 9848228004 నెంబర్‌కు పంపించాలని కోరారు. విజేతలకు వచ్చే నెల 3వ తేదీన జరిగే కార్యక్రమంలో బహుమతులను అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ ఉపాధ్యక్షుడు బూర్గు గోపికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

లింకు రోడ్లకు రూ.10 కోట్ల నిధులు మంజూరు



ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డిని సన్మానిస్తున్న ప్రమోద్‌రెడ్డి

మునుగోడు రూరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏలగలగూడెం, కల్వకుంట్ల, చలిమెడ కిష్టాపురం మునుగోడు తదితర గ్రామాల్లో ఉన్న లింకు రోడ్ల నిర్మాణం కోసం రూ.10 కోట్ల వ్యయంతో కూడిన లింకు రోడ్లు మంజూరయ్యాయి. ఈ నిధులను మంజూరు చేసిన ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డిని కాంగ్రెస్ నాయకులు మేకల ప్రమోద్‌రెడ్డి కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మునుగోడు అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తూ ప్రభుత్వంతో ప్రత్యేక నిధులను మంజూరు చేస్తున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు.

నియోజకవర్గానికి 4 వేల ఇళ్లను పంపిణీ చేయాలి

దామరచర్ల, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గానికి 4 వేల ఇందిరమ్మ ఇళ్లను పంపిణీ చేసి పేదలను ఆదుకోవాలని సీపీఐ మండల కార్యదర్శి ధీరావత్ లింగానాయక్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇస్తామని చెప్పి పేదలను మోసం చేసిందని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం నియోజకవర్గానికి 4 వేల ఇళ్లను కేటాయించి అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి ఇంటిని అందించాలన్నారు. రైతులు పండించిన ధాన్యానికి మద్దతు ధర కేటాయించాలన్నారు. వెంటనే గ్రామాల్లో ఐకేపి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులు పండించిన చివరి గింజ వరకు కొనుగోలు చేయాలన్నారు. సమావేశంలో నాయకులు ధీరావత్ శాంత, రాములు, లక్ష్మయ్య, నాగయ్య, అన్నపూర్ణ పాల్గొన్నారు.

వానరానికి అంత్యక్రియలు

చిట్యాల, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): చిట్యాల మునిసిపాలిటీలోని 12వ వార్డులో శుక్రవారం కుక్కల దాడిలో వానరం (కోతి) మృతి చెందింది. దానికి కాలనీవాసులు శుక్రవారం అంత్యక్రియలు నిర్వహించారు. స్థానిక కౌన్సిలర్ రెమిడాల లింగస్వామి ఆధ్వర్యంలో కాలనీవాసులు, మునిసిపల్ సిబ్బందితో కలిసి అంతిమయాత్ర నిర్వహించారు. పాడె కట్టి డప్పుచప్పుళ్లతో వానరానికి అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో కాలనీవాసులు సాగర్ల గోవర్దన్, బొల్గూరి సైదులు, నూనె శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి

పెద్దఅడిశర్లపల్లి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి, ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (టీపీయూఎస్) ఎప్పుడు ముందుంటుందని ఆ సంఘం నాయకులు అన్నారు. శుక్రవారం మండలకేంద్రంలో ఎంఈవో వెంకటయ్యను సంఘం తరుపున ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ ఉపాధ్యాయ సంఘాలు పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో తపస్ సంఘం మండల అధ్యక్షుడు జినుకల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పిల్లి ఏడుకొండలు, జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, నాయకులు సంతోష్‌రెడ్డి, కొమిరెడ్డి సైదులు, అంజయ్య, శ్రీనివాస్, మోతీలాల్ పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతి కోసం కృషి చేసిన సుద్దాల హన్మంతు

నకిరేకల్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): పేద ప్రజల అభ్యున్నతి కోసం సుద్దాల హన్మంతు ఎంతో కృషి చేశారని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. అరుణోదయ గాయకుడు నాగన్నకు సుద్దాల హన్మంతు జానకమ్మ జాతీయ పురస్కారానికి ఎంపికయ్యాడు. నకిరేకల్‌లో శుక్రవారం జాతీయ పురస్కారం కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. 19వ తేదీన హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నాగన్నకు ఇస్తున్న సుద్దాల హన్మంతుజానకమ్మ జాతీయ పురస్కార కార్యక్రమానికి కళాకారులు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

డివిజన్‌లో 74 కొనుగోలు కేంద్రాలు : సబ్ కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ నారాయణ అమిత్

మిర్యాలగూడ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మిర్యాలగూడ డివిజన్‌లో రైతుల ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు 74 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు సబ్ కలెక్టర్ నారాయణ అమిత్ తెలిపారు. శుక్రవారం ఆయన ఛాంబర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 40 ఐకేపీ, 34 పీఏసీఎస్‌ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. డివిజన్‌లో సన్నరకం ధాన్యం పండించే రైతులు ఎక్కువగా ఉన్నందున 51 కేంద్రాల్లో సన్నరకం, 23 కేంద్రాల్లో దొడ్డురకం ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఏ రోజు కాంటాలు అయిన ధాన్యాన్ని ఆ రోజే మిల్లులకు పంపే విధంగా లారీలను అందుబాటులో ఉండే విధంగా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. 17 శాతం తేమతో నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి మద్దతు ధర పొందాలని సూచించారు. రైతులు ధాన్యంతో బాటు తమ ఆధార్ కార్డు, పట్టాదారు పాస్ పుస్తకం, బ్యాంకు ఖాతాకు సంబంధించిన పత్రాలు తీసుకురావాలని సూచించారు. రైతులకు మూడు రోజుల్లో ధాన్యం విక్రయ డబ్బులు వారి ఖాతాల్లో జమ చేయనున్నట్లు తెలిపారు. బయటి రాష్ట్రాల నుంచి ధాన్యం లారీలు రాకుండా వాడపల్లి, నాగారునసాగర్‌లో చెక్ పోస్టులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని ఆయన సూచించారు.



డాక్టరేట్ పట్టా అందుకుంటున్న శ్రీనివాస్

శ్రీనివాస్‌కు డాక్టరేట్

నల్లగొండరూరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ పట్టణానికి చెందిన గుంటోజు శ్రీనివాస్ డాక్టరేట్ అందుకున్నారు. నల్లగొండ పట్టణానికి చెందిన శ్రీనివాస్ ప్యూరిఫైర్‌పై పరిశోధనలు చేసి ఆల్కలిన్ తయారీపై పరిశోధనలు నిర్వహించి ఫలితాలు సాధించాడు. చైన్నై చెందిన గ్లోబల్ పీస్ యూనివర్సిటీ గుర్తించి డాక్టరేట్ పట్టాను అందించింది. తాను చేస్తున్న పని నలుగురికి ఉపాధి పొందాలని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో సీజన్ ప్యూరిఫైర్ ఆల్కలిన్ ఫిల్టర్స్ సరఫరా చేస్తున్నారు. దీనివల్ల వేలాది మందికి ఉపాధి పొందుతున్నారు. యువతకు తనకు తెలిసిన రంగంలో మెళకువలు నేర్పడంతో పాటు నిరుపేదలకు సహాయ, సహకారాలు అందిస్తున్నారు. రోడ్డు ప్రమాదంలో గాయపడిన, ఇతర కారణాల వల్ల రక్తం కావాల్సిన వారికి రక్తాన్ని అందించేందుకు రక్తశిబిరాలను ఏర్పాటు చేశారు. అంతేకాక వాట్సప్‌లో గ్రూపులు ఏర్పాటు చేసి ఆపదలో ఉన్నవారికి వెంటనే రక్తాన్ని అందించే ఏర్పాట్లను నిర్వహిస్తున్నారు. ఆయన సేవలను గుర్తించిన గ్లోబల్ పీస్ యూనివర్సిటీ గుర్తించి డాక్టరేట్ పట్టాను అందజేసింది.

అధికార పార్టీ నేతలకు పోలీసుల వత్తాసు

● జడ్పీ మాజీ ఛైర్మన్ బండా, మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే లింగయ్య, నరేందర్‌రెడ్డి

నల్లగొండ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): నకిరేకల్ నియోజకవర్గంలో పోలీస్ యంత్రాంగం అధికార పార్టీకి వత్తాసు పలుకుతూ వారికి తొత్తులుగా పనిచేస్తోందని మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ఆరోపించారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం జడ్పీ మాజీ ఛైర్మన్ బండా నరేందర్‌రెడ్డితో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నకిరేకల్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ కార్యకర్తలపై జరిగిన దాడులను వివరించారు. నకిరేకల్‌లో అరాచక పాలన సాగుతుందని ఎమ్మెల్యే నియోజకవర్గంలో రోజుకు ఓ చోట బీఆర్ఎస్ శ్రేణులపై దాడులు చేయిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే లింగయ్య ఆరోపించారు. బీఆర్ఎస్ కార్యకర్తలపై దాడులకు పాల్పడితే సహించేది లేదని ఆయన హెచ్చరించారు. పోలీసులు తమ తీరును మార్చుకోకపోతే బీఆర్ఎస్ నాయకత్వంతో కలిసి ఎస్పీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు. పేదలకు న్యాయం చేయాల్సింది పోయి వారిపైనే దాడులు చేయడం సమంజసం కాదని ఇలాంటి పద్ధతులు మార్చుకోవాలని హెచ్చరించారు. జడ్పీ మాజీ ఛైర్మన్ నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ పోలీసులు చట్ట ప్రకారం నడుచుకొని ప్రజలకు న్యాయం చేయాలన్నారు. సమావేశంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఎదుగుదల లేని పత్తి పంట పరిశీలన

హాలియా, అక్టోబరు 18: పత్తి విత్తనాల ఎదుగుదలలో తేడా ఉందని అనుముల మండలం పాలెం గ్రామానికి చెందిన రైతులు వ్యవసాయాధికారులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు శుక్రవారం ఏవో సరిత ఆధ్వర్యంలో శాస్త్రవేత్తలు పత్తి పంటలను పరిశీలించారు. పత్తిని డాక్టర్ శ్రీధర్, డాక్టర్ రాములమ్మ, కంపసాగర్‌కు చెందిన శాస్త్రవేత్తలు పరిశీలించారు. నివేదికను జిల్లా వ్యవసాయాధికారికి పంపించనున్నట్లు తెలిపారు. వారి వెంట రైతులు జక్కల శ్రీనివాస్, పగిళ్ల రమేష్, కొమ్మనబోయిన శంకర్, ఏఈవో రమేష్ ఉన్నారు.

ముగిసిన శిక్షణ

కొండమల్లేపల్లి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): అంతర్గత మిషన్ భగీరథశాఖ ఆధ్వర్యంలో కొండమల్లేపల్లి ఎంపీడీవో కార్యాలయంలో గ్రామ మంచినీటి సహాయకుల శిక్షణ తరగతులు శుక్రవారంతో ముగిశాయి. కొండమల్లేపల్లి మండలానికి చెందిన 26 మంది, చింతపల్లి మండలానికి చెందిన 14మంచినీటి సహాయకులు పాల్గొన్నారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ ఇంట్రా ఈఈ డి.శాంతకుమారి, డిప్యూటీ ఈఈ కె.నగేష్, ఎంపీడీవో బాలరాజురెడ్డి, ఏఈలు మాల్యాద్రి, బి.శేఖర్, శ్రీనివాస్, మంచినీటి సహాయకులు పాల్గొన్నారు.

గీత పనివారల సంఘం వార్షికోత్సవం

చిట్యాలరూరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఈనెల 19, 20వ తేదీల్లో జరిగే గీత పనివారల సంఘం వార్షికోత్సవాన్ని జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బొడిగె సైదులు కోరారు. గీత కార్మికుల హక్కుల కోసం నిరంతరం పోరాడే సంఘం గీత పనివారల సంఘమని అన్నారు. గ్రామగ్రామాన గీత పనివారల సంఘం వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహించాలని తెలిపారు.

తారు రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు

శాలిగౌరారం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): శాలిగౌరారం మండలం తక్కళ్లపహాడ్ గ్రామం నుంచి ఆకారం గ్రామం వరకు తారు రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే మందుల సామేలు రూ.3.50 కోట్లు మంజూరు చేశారు. నిధుల మంజూరు చేయడంపై తక్కళ్లపహాడ్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు కట్టగూరి మహేందర్ రెడ్డి, సురేందర్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. తక్కళ్లపహాడ్ నుంచి ఆకారం వరకు రోడ్డు గుంతలమయంగా మారి అస్తవ్యస్తంగా తయారైందన్నారు. వెంటనే పనులు చేపట్టి పూర్తి చేయాలని అన్నారు.

సీసీఐ కొనుగోలు కేంద్రాలను వెంటనే ఏర్పాటు చేయాలి

మర్రిగూడ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): పత్తి సీసీఐ కేంద్రాలను ఏర్పాటు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం తగదని శివన్నగూడ వ్యవసాయ సహకార పరపతి సంఘం ఛైర్మన్ బాలం నర్సింహ, మర్రిగూడ మండల మాజీ రైతు సమన్వయ కమిటీ ఛైర్మన్ బచ్చు రామకృష్ణ అన్నారు. మండలంలో పత్తి సీసీఐ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయలేక పోవడం వల్ల రైతులు దళారుల చేతుల్లో మోసపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో నాయకులు వెంకటరమణారెడ్డి, రాపోలు యాదగిరి పాల్గొన్నారు.

నేడు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా

కట్టంగూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): కట్టంగూరులోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట శనివారం ధర్నా నిర్వహించనున్నట్లు మాజీ జడ్పీటీసీ తరాల బలరాం తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేయాలని కోరుతూ ధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు. సమావేశంలో నాయకులు పోగుల నర్సింహ, పెద్ది బాలనర్సింహ, సైదిరెడ్డి, గుర్రం సైదులు, జానీపాషా, దాసరి సంజయ్, శ్రీను, రాచకొండ యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత

మర్రిగూడ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను సద్వినియోగం చేసుకోవాలని మాజీ ఎంపీటీసీ ఉరిపక్క నగేష్ అన్నారు. మండలంలోని కొట్టాల గ్రామానికి చెందిన మేతరి నిర్మల, కె.వెంకటేష్ లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో లపంగి భిక్షం, సైదులు, నీలకంఠ శివ పాల్గొన్నారు.

నో పార్కింగ్‌లో వాహనాలు నిలిపితే కఠిన చర్యలు

నల్లగొండరూరల్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): నో పార్కింగ్‌లో వాహనాలు నిలిపితే కఠినచర్యలు తీసుకుంటామని నల్లగొండ ట్రాఫిక్ సీఐ రాజు తెలిపారు. శుక్రవారం నోపార్కింగ్ స్థలాల్లో ఉంచిన వాహనాలను వెహికిల్ లిఫ్టింగ్ వాహనం ద్వారా పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం వాహనదారులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని పలు ప్రాంతాల్లో నో పార్కింగ్‌లో పెట్టిన దాదాపు 50వాహనాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించడంతో పాటు ట్రాఫిక్ పోలీసులకు సహకరించాలని అన్నారు.

బీజేపీ ఐటీ సెల్ కన్వీనర్‌గా రాజశేఖర్‌రెడ్డి

రామగిరి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): బీజేపీ ఐటీ సెల్ కన్వీనర్‌గా వైవీ రాజశేఖర్‌రెడ్డి ఎన్నికయ్యారు. ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు వర్షిత్‌రెడ్డి నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు.